RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 96 | ఏప్రిల్ 26 ఆదివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 96 | April 26 Sunday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ఆర్టీసీ బలోపేతమే లక్ష్యం 2

## ఇప్పటి కేసీఆర్ ఒక మరమనిషి

మాజీ ఎమ్మెల్సీ కవిత ఘాటు విమర్శలు.. కొత్త పార్టీని ప్రకటించిన కవిత




**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ రాజకీయ చిత్రపటంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. కల్వకుంట్ల కవిత సారథ్యంలో 'తెలంగాణ రాష్ట్ర సేన' (టిఆర్ఎస్) అనే నూతన రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కవిత పార్టీ పేరు, జెండా, ఎజెండాను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ.. అమరవీరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో సామాజిక న్యాయం కరువైందని, ఉద్యమ ఆకాంక్షలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పదేళ్ల అవినీతి పాలన, కాంగ్రెస్ మోసపూరిత వైఖరి, బిజెపి అసమర్థతకు వ్యతిరేకంగా పోరాడటమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. గత పాలకుల్లో తాను కూడా భాగస్వామిని అయినందుకు తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఆనాటి ఉద్యమకారుడు కెసిఆర్‌కు, నేటి కెసిఆర్‌కు నక్కకు నాగలోకానికి

➤ మిగతా 2వ పేజిలో..

## 47 మంది మావోల లొంగుబాటు

డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడి



**హైదరాబాద్**
తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం క్రమంగా కనుమరుగవుతున్న నేపథ్యంలో, మరో 47 మంది అజ్ఞాత మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరారు. ఈ కీలక పరిణామాన్ని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా వెల్లడించారు. లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులతో పాటు దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన హేమ్లా ఇతు (విజ్జా), పోడియం లచ్చు (మనోజ్) వంటి కీలక నేతలు

➤ మిగతా 2వ పేజిలో..

## ఏపీఎస్ ఆర్టీసికి అవార్డు

'పీఎస్ఈ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్-2026'



**హైదరాబాద్**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) తన ప్రస్థానంలో మరో మైలురాయిని అధిగమించింది. ప్రజా రవాణా వ్యవస్థలో సరికొత్త సాంకేతికతను జోడించి, వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నందుకు గానూ ఈ సంస్థకు ప్రతిష్టాత్మక 'పీఎస్ఈ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్-2026' జాతీయ అవార్డు లభించింది. హైదరాబాద్ వేదికగా జరిగిన ఇండియా పీఎస్ఈ సమ్మిట్‌లో ఈ పురస్కారాన్ని అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గనిర్దేశంలో, సాంకేతికతను అందిపుచ్చుకుంటూ డిజిటల్ సేవల విస్తరణలో ఏపీఎస్ఆర్టీసీ చూపుతున్న చొరవకు ఈ గౌరవం దక్కింది.
ముఖ్యంగా డిజిటల్ టికెటింగ్, కార్గో సేవలు మరియు ప్రయాణికులకు అవసరమైన సమాచారాన్ని వేగవంతంగా అందించడంలో సంస్థ విశేష కృషి చేస్తోంది. ఈ ఘనత సాధించడంలో కీలకపాత్ర పోషించిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావుతో పాటు సంస్థ సిబ్బందిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి

➤ మిగతా 2వ పేజిలో..

## భయం వల్ల పార్టీని వీడలేదు

### ఎంపీ రాఘవ చద్దా మరోసారి స్పష్టం

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
ఆమ్ ఆద్మీ పార్టీని వీడి భారతీయ జనతా పార్టీలో చేరిన ఎంపీ రాఘవ్ చద్దా తన నిర్ణయం వెనుక ఉన్న కారణాలను మరోసారి స్పష్టం చేశారు. తాము కేవలం భయం వల్ల పార్టీని వీడలేదని, అరవింద్ కేజ్రీవాల్ అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాల వల్లే బయటకు రావాల్సి వచ్చిందని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం ఆ పార్టీ తన సిద్ధాంతాలకు విరుద్ధంగా నడుస్తోందని, నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలు మరియు నాయకులు అక్కడ ఇమడలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసం, అవినీతిపరుల చేతుల్లోకి పార్టీ వెళ్లడం వల్లే తాము ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా 'శీష్ మహల్' వ్యవహారం ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసిందని, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి ఇది ప్రధాన కారణమైందని రాఘవ్ చద్దా విమర్శించారు. నిరాశ, నిస్పృహల వల్లే తాను సహా మరో ఆరుగురు ఎంపీలు పార్టీని వీడామని, తప్పుడు పనుల్లో భాగస్వామ్యం పంచుకోవడం ఇష్టం లేకనే ప్రత్యామ్నాయ

## భారీగా ఐఏఎస్‌ల మార్పు

**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో కీలక మార్పులు చేస్తూ భారీ స్థాయిలో ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 30 మంది అధికారులకు స్థానచలనం కల్పిస్తూ శనివారం అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ బదిలీల్లో భాగంగా పలు జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించడంతో పాటు సచివాలయ స్థాయిలోని కీలక శాఖలకు కొత్త కార్యదర్శులను కేటాయించారు. ప్రధానంగా నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న 2017 బ్యాచ్ అధికారి ప్రతీక్ జైన్‌ను సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేయగా, ఆయన స్థానంలో ప్రస్తుతం ఐడబీఆర్ ప్రత్యేక కమిషనర్‌గా ఉన్న చెక్క ప్రియాంక (2018 బ్యాచ్) నారాయణపేట నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న హరిచందన దాసరిని కార్మిక శాఖ (రాజుడు) కార్యదర్శిగా పంపగా, ఆమె స్థానంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా ఉన్న ప్రియాంక అలా హైదరాబాద్ నూతన కలెక్టర్‌గా నియామకమయ్యారు. ఉన్నత స్థాయి మార్పులను గమనిస్తే, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్‌ను ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రత్యేక



అధికారిగా పంపారు. ఆయన బాధ్యతలను ఎం. దాన కిషోర్ చేపట్టనున్నారు. అలాగే ఖమ్మం కలెక్టర్‌గా ఉన్న అనుదీప్ దురిశెట్టిని ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శిగా బదిలీ చేయగా, ములుగు కలెక్టర్ దివాకర

➤ మిగతా 2వ పేజిలో..

## మహిళల రక్షణే ధ్యేయం

**కలకత్తా జనసంఘర్షణ**
పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మహిళల రక్షణే ధ్యేయంగా భారతీయ జనతా పార్టీ పనిచేస్తుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ప్రస్తుతం బెంగాల్‌లో మహిళలు తీవ్ర భయాందోళనల మధ్య జీవిస్తున్నారని, సాయంత్రం ఏడు గంటల తర్వాత బయటకు రావొద్దంటూ స్వయంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించడం శోచనీయమని



➤ మిగతా 2వ పేజిలో..

## వచ్చే నెల మే 9వ తేదీన మోడీ పర్యటన

**హైదరాబాద్ జనసంఘర్షణ**
ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే నెల మే 9వ తేదీన తెలంగాణలో పర్యటించనున్నారు. రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు ఇప్పటికే సిద్ధమైన ప్రాజెక్టులను జాతికి అంకితం చేసేందుకు ఈ పర్యటన వేదిక కానుంది. ముఖ్యంగా హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థలో కీలకమైన ఎంఎంటీఎస్ రెండో దశ ప్రాజెక్టును ప్రధాని



➤ మిగతా 2వ పేజిలో..

# ఇప్పటి కేసీఆర్ ఒక మరమనిషి

**మొదటిపేజీ తరువాయి..** ఉన్నంత తేడా ఉందని ఆమె ఘాటుగా విమర్శించారు. ప్రస్తుత కెసిఆర్ కేవలం ఒక "మర మనిషి"గా మారిపోయారని, ఆయన స్వార్థపరులు మరియు గుంటనక్కల చేతిలో ఖైదీ అయ్యారని సంచలన వ్యాఖ్యలు చేశారు. జాతీయ రాజకీయాల మోజులో పడి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని, అందుకే పాలమూరు-రంగారెడ్డి వంటి కీలక ప్రాజెక్టులు నేటికీ పూర్తి కాలేదని విమర్శించారు. బిఆర్ఎస్ తన ఆత్మను కోల్పోయిందని, అందుకే తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడటానికి తాను ఈ కొత్త వేదికను సిద్ధం చేశానని వివరించారు.
రాష్ట్ర ప్రయోజనాల విషయంలో బిజెపి ఎంపీల తీరును కూడా కవిత తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ నుంచి ఏడు మండలాలను లాక్కున్నా, విభజన హామీలను తుంగలో తొక్కినా భాజపా నేతలు నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. భద్రాచలం రాముడి ఆలయ మనుగడ కోసం ఏపీలో కలిసిన ఐదు గ్రామాలను తిరిగి రాష్ట్రంలోకి తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజానికి ఒక 'అమ్మ' వలె అండగా ఉండి, పాలనలో అమ్మతనాన్ని చూపిస్తూ సామాజిక న్యాయమే ఎజెండాగా పనిచేస్తానని ఆమె హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలపై అలుపెరగని పోరాటం చేస్తామని, కార్యకర్తలు యుద్ధానికి సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు.

# 47 మంది మావోల లొంగుబాటు

**మొదటిపేజీ తరువాయి..** ఉన్నారు. లొంగుబాటు సందర్భంగా వీరు పెద్ద ఎత్తున ఆయుధాలను కూడా పోలీసులకు అప్పగించారు. ఇందులో ఏకే-47 రైఫిళ్లు, పిస్టళ్లు, రివాల్వర్లు సహా మొత్తం 32 ఆయుధాలు, 515 తూటాలు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆకర్షణీయమైన పునరావాస విధానానికి ఆకర్షితులయ్యే వీరంతా అడవి బాట వీడి బయటకు వచ్చారని డీజీపీ పేర్కొన్నారు. ప్రస్తుతం దక్షిణ బస్తర్ డివిజన్ పూర్తిగా నిర్వీర్యమైందని తెలిపిన డీజీపీ, లొంగిపోయిన వారిలో వివిధ ప్లాటూన్లు మరియు బెటాలియన్లకు చెందిన సభ్యులు ఉన్నారని వివరించారు. అయితే, గణపతి (లక్ష్మణరావు), పసునూరి నరహరి, జాడి రత్నాభాయ్ వంటి మరికొందరు అగ్రనేతలు ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారని, వారు కూడా తక్షణమే లొంగిపోయి ప్రభుత్వ ఫలాలను అందుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లలో పోలీసులు చేపట్టిన సమర్థవంతమైన చర్యల వల్ల మొత్తం 818 మంది మావోయిస్టులు లొంగిపోగా, వారి నుంచి 334 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు గణాంకాలను వెల్లడించారు. ఈ భారీ లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావం మరింతగా తగ్గుముఖం పట్టిందని భద్రతా దళాలు భావిస్తున్నాయి.

## ఏపీఎస్ ఆర్టీసికి అవార్డు

**మొదటిపేజీ తరువాయి..** రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఏపీఎస్ఆర్టీసీ గతంలోనూ అనేక జాతీయ స్థాయి అవార్డులను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది జనవరిలో కూడా బస్టాండ్లలో 'ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్'ను విజయవంతంగా అమలు చేసినందుకు గానూ 'గవర్నెన్స్ నౌ - డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అవార్డును దక్కించుకుంది. వరుసగా లభిస్తున్న ఈ పురస్కారాలు సంస్థ యొక్క డిజిటల్ ప్రగతికి నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# భారీగా ఐఏఎస్‌ల మార్పు

**మొదటిపేజీ తరువాయి..** టీఎస్ ఖమ్మం కలెక్టర్‌గా వెళ్లనున్నారు. ములుగు బాధ్యతలను భోర్ఖాడే హేమంత్ సహదేవరావుకు అప్పగించారు. నిర్మల్ కలెక్టర్‌గా ఉన్న అభిలాష అభినవ్‌ను ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శిగా నియమించగా, ఐటీ శాఖలో ఉన్న భావేష్ మిశ్రా నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా వెళు ‌_న్నారు. నాగర్ కర్నూల్ కలెక్టర్‌గా హేమంత్ కేశవ్ పాటిల్ నియమితులయ్యారు.
జిల్లాలతో పాటు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (+ఎవీజ) పరిధిలో కూడా భారీ మార్పులు జరిగాయి. వివిధ జోనల్ కమిషనర్ల స్థానాల్లో 2022 బ్యాచ్‌కు చెందిన యువ అధికారులకు అవకాశం కల్పించారు. సెర్లింగంపల్లికి నారాయణ అమిత్ మాలెంపాటి, ఎల్బీనగర్‌కు వికాస్ మహతో, కూకట్‌పల్లికి మయాంక్ సింగ్ జోనల్ కమిషనర్లుగా నియమితులయ్యారు. వీరితో పాటు మరికొందరు అధికారులను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులుగా మరియు వివిధ శాఖల ప్రత్యేక కార్యదర్శులుగా ప్రభుత్వం కేటాయించింది. పాలనలో వేగం పెంచేందుకే ప్రభుత్వం ఈ స్థాయిలో ఐఏఎస్ అధికారుల బదిలీలు చేపట్టినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# భయం వల్ల పార్టీని వీడలేదు

**మొదటిపేజీ తరువాయి..** మార్గాన్ని ఎంచుకున్నట్లు వివరించారు. దేశాభివృద్ధి కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే కేజ్రీవాల్ ప్రాధాన్యత ఇస్తున్నారని, పార్టీలో ప్రస్తుతం అసహ్యకరమైన వాతావరణం నెలకొందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీని వీడే ప్రక్రియలో మరికొందరు నేతలు కూడా ఉన్నారని ఆయన సంకేతాలిచ్చారు.

# వచ్చే నెల 9వ తేదీన మోడీ పర్యటన

**మొదటిపేజీ తరువాయి..** ప్రారంభించనున్నారు. దీంతో పాటు బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రిలో పూర్తయిన నూతన విభాగాలను కూడా ఆయన జాతికి అంకితం చేసే అవకాశం ఉంది. రవాణా, ఆరోగ్య రంగాలకు సంబంధించి ఈ రెండు ప్రాజెక్టులు తెలంగాణ ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చనున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఒక భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాని హోదాలో ఆయన ఇచ్చే ప్రసంగంపై రాజకీయంగానూ ఆసక్తి నెలకొంది. షెడ్యూల్‌లో భాగంగా మల్లారెడ్డి యూనివర్సిటీ సందర్శన కూడా ఉండవచ్చని ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై ఇంకా అధికారికంగా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. మొత్తం మీద తెలంగాణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రధాని, తన పర్యటన ద్వారా రవాణా మరియు వైద్య రంగాల్లో కొత్త సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

# మహిళల రక్షణే ధ్యేయం

**మొదటిపేజీ తరువాయి..** ఆయన విమర్శించారు. పూర్బ బర్ధమాన్ జిల్లా జమాల్‌పూర్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ, మే 5వ తేదీన రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మహిళలకు పూర్తిస్థాయి స్వేచ్ఛ లభిస్తుందని హామీ ఇచ్చారు. యువతులు మరియు సోదరీమణులు అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత కూడా ధైర్యంగా రోడ్లపై తిరిగేలా భద్రతను కల్పిస్తామని, వారి వైపు కన్నెత్తి చూసేందుకు కూడా దుండగులు సాహసించని రీతిలో కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.
గత 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని, మమతా బెనర్జీ ప్రభుత్వం శాంతిభద్రతల నిర్వహణలో పూర్తిగా విఫలమైందని షా ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలు ఎంతో సురక్షితంగా ఉన్నారని, అదే తరహా రక్షణను బెంగాల్‌లో కూడా తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు. కేవలం ఓట్ల రాజకీయాల కోసమే కాకుండా, సామాజిక భద్రతను మెరుగుపరచడం తమ లక్ష్యమని, ఎవరైనా మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే వారిని వెంటనే కటకటాల్లోకి నెడతామని హెచ్చరించారు. బెంగాల్ భవిష్యత్తు మారాలంటే మహిళా ఓటర్లు కీలక పాత్ర పోషించాలని, మే 5 తర్వాత రాష్ట్రంలో భయం లేని వాతావరణం నెలకొంటుందని అమిత్ షా తన ప్రసంగంలో ధీమా వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ బలోపేతమే లక్ష్యం

**హైదరాబాద్**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను (ఆర్టీసీ) బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలను వివరించారు. ముఖ్యంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న దశాబ్దాల కల నెరవేర్చడంతో పాటు, 11 శాతం పీఆర్సీ ప్రకటన మరియు కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణ పట్ల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సమ్మె సమయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల బృందం సుమారు 15 గంటల పాటు చర్చలు జరిపి, కార్మికుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించిందని గుర్తు చేశారు.

గత ప్రభుత్వ హయాంలో 55 రోజుల పాటు సమ్మె జరిగినా నాటి పాలకులు స్పందించలేదని, ఆ సమయంలో అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని మంత్రి విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వానికి కార్మికులతో ఎలాంటి విభేదాలు లేవని, వారిని కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నామని చెబుతూ.. సమ్మె కాలంలో మరణించిన శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇదే క్రమంలో ప్రతిపక్ష నేతలు బండి సంజయ్ వంటి వారు శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. 2017 పీఆర్సీ బకాయిలు, డీఏలు, పీఎఫ్ బకాయిల చెల్లింపులతో పాటు కొత్త బస్సుల కొనుగోలు, కారుణ్య నియామకాలు మరియు తొలగించిన ఉద్యోగులను తిరిగి తీసుకోవడం వంటి చర్యల ద్వారా ఆర్టీసీని గాడిలో పెడుతున్నామని వివరించారు. ప్రస్తుతం రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తూ, సామాన్యుల జీవిత రేఖగా మారిన ఆర్టీసీ ప్రగతిలో అందరూ భాగస్వాములు కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## పెట్రో కొరతపై సిఎం అత్యవసర సమీక్ష

### తక్షణం సమస్యను పరిష్కరించాలని ఆదేశం

### పెట్రో డీలర్లతో మాట్లాడిన అధికారులు

**అమరావతి, ఏప్రిల్25 :** రాష్ట్రంలో ఇంధన కొరతతో పలు చోట్ల పెట్రోల్ బంకుల మూసివేత అంశంపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం సమీక్ష నిర్వహించారు. పలు జిల్లాల్లో పరిస్థితులు, వాహనదారులు, రైతుల ఇబ్బందులపై అధికారులతో సీఎం మాట్లాడారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎస్ సాయిప్రసాద్, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలని ఆదేశించారు. పెట్రోల్ బంకుల యజమానులు, ఆయిల్ కంపెనీలతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. సీఎం ఆదేశాలతో వెంటనే స్పందించిన అధికారులు.. ఇంధన సరఫరాపై పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్‌తో ఫోన్‌లో చర్చలు జరిపారు. తక్షణం స్టాక్ లేని బంకుల వివరాలు అందించాలని అధికారులు ఆదేశించారు. దీంతో జిల్లాల అధ్యక్షులకు రాష్ట్ర డీలర్ల అసోసియేషన్ సమాచారం పంపించింది. స్టాక్ సమస్య ఉంటే తక్షణం టోల్‌ఫ్రీ నం.1967కు కాల్ చేయాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సూచించారు. టోల్‌ఫ్రీకి ఫోన్ చేసి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. గత ఏప్రిల్ కంటే పదిశాతం అదనపు సరఫరాకు ఆయిల్ కంపెనీలు అంగీకారం తెలిపాయి. పెట్రోల్ డీలర్ల నుంచి ఏపీఎఫ్‌పీటీ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ వివరాలు సేకరిస్తున్నారు. ఆయిల్

# బిఆర్ఎస్ ఉండి అవినీతిలో భాగస్వామ్యం

### ఇప్పుడు నీతి పలుకులు పలికితే ప్రజలు నమ్మరు

### సిఎం రేవంత్‌ను విమర్శిస్తే ఓట్లు రాలవు

### కవిత పార్టీపై ఎంపి చామల విమర్శలు

**హైదరాబాద్హైదరాబాద్, ఏప్రిల్25 :** బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కవిత బయటకు వచ్చి పార్టీ పెట్టి ఉంటే ప్రజల్లో మంచి ఆదరణ వచ్చేదని కాంగ్రెస్ భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. అధికారంలో ఉండగా అవినీతిలో భాగస్వామ్యం అయిన కవిత ఇప్పుడు పార్టీ పెట్టి ప్రజలను ఎలా నమ్మిస్తామని అనుకుంటున్నారని ప్రశ్నించారు. కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై ఎంపి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పెట్టినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. అమ్మగా జేబులు చూసి కాదని.. కడుపు చూసి పాలిస్తానని కవిత చెప్పారని ప్రస్తావించారు. శనివారం హైదరాబాద్ లో కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు జేబులు చూసి పరిపాలించారని కవిత చెప్పారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గతంలో టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణను కేసీఆర్ హయాంలో దోపిడీ చేశారని ఎంపీ చామల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు కవిత ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పంచుకునే వాటాల్లో తేడాలు వచ్చి ఆమె బయటకు వచ్చారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని అన్నారు. కవిత ఇప్పుడు బయటకు వచ్చి సీఎం, సీఎం అని నినాదాలు చేయించుకుంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కర్కోటకుడు, హిట్లర్ అంటే కవితకు మార్కులు పడవని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ, ఫ్యూచర్ సిటీ, ఉద్యోగాలు, మూసీ ప్రక్షాళన చేస్తున్నందుకు కర్కోటకుడు అయ్యారా...? అని ఫైర్ అయ్యారు. కవిత పార్టీ పెట్టుకోవచ్చని, పోరాటం చేయొచ్చని, ప్రజల్లోకి వెళ్లవచ్చని తెలిపారు. తెలంగాణను దోచుకోవడానికే ఆమె సీఎం కావాలని అంటున్నారా..? అని నిలదీశారు. కవిత నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. ఆమె తెల్లకాగితం కాదని.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంపీగా, ఎమ్మెల్సీగా పని చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలను కవిత తప్పుదోవ పట్టిస్తున్నారని.. తెలంగాణ ప్రజలు ఆమెను నమ్మరని కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

# అవినీతిలో కూరుకు పోయిన కేజ్రీవాల్

### అందుకే పార్టీని వీడాల్సి వచ్చింది

### ఎంపీ స్వాతి మాలీవాల్ తీవ్ర విమర్శలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్25 :** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పై ఎంపీ స్వాతి మాలీవాల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించినప్పుడు నిజాయితీగా ఉన్న కేజ్రీవాల్ అధికారంలోకి వచ్చాక అవినీతిలో కూరుకుపోయారని ఆరోపించారు. 2011లో ఢిల్లీలో తాము అవినీతి వ్యతిరేక ఉద్యమం చేపట్టిన సమయంలో.. ఆయన చిరిగిన దుస్తులు వేసుకునేవారని..రెండు రూపాయల పెన్ను వాడుతూ.. పూర్తిగా పాడుబడిన కారులో తిరిగేవారని గుర్తుచేశారు. దేశంలోని వ్యవస్థల్లో మార్పు తెస్తారనే నమ్మకంతో తామంతా కేజ్రీవాల్ వెనుక నడిచామన్నారు. అయితే సీఎంగా అధికారంలోకి వచ్చిన తర్వాత.. రూ.100 కోట్లతో విలాసవంతమైన ఇల్లు కట్టుకున్నారని దుయ్యబట్టారు. పార్టీని వీడినందుకు అందరూ తమను ద్రోహులుగా భావిస్తున్నారని..కానీ అసలైన ప్రజా ద్రోహి కేజ్రీవాలేనని ఆమె మండిపడ్డారు. 2006 నుంచి తాను అరవింద్ కేజ్రీవాల్‌తో కలిసి పని చేశానని.. ప్రతి ఉద్యమంలోనూ ఆయనకు మద్దతిచ్చానని తెలిపారు. అయినప్పటికీ కేజ్రీవాల్ నివాసంలోనే ఆయన వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌తో తనను తీవ్రంగా కొట్టించారన్నారు. ఢిల్లీలో ఆప్ ఓటమి తర్వాత వారి అవినీతి పంజాబ్‌కు పాకిందన్నారు. తాను ఎవరి బలవంతం మీదనో భాజపాలో చేరలేదని.. ప్రధాని మోదీ నాయకత్వంపై ఉన్న నమ్మకంతోనే చేరానని స్పష్టం చేశారు.

# ఆప్ సరైన రీతిలో నడవకనే ఈ దుస్థితి

### ఎంపిలు పార్టీ వీడడంపై అన్నాహజారే స్పందన

**రాలెగావ్, ఏప్రిల్25 :** ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాఘవ్ చద్దాతో పాటు మరో ఆరు మంది రాజ్యసభ ఎంపీలు ఆ పార్టీని వీడిన విషయం తెలిసిందే. ఆప్‌కు గుడ్‌బై చెప్పిన ఆ ఎంపీలు బీజేపీలో చేరారు. అయితే ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త హన్నా హజారా మాట్లాడారు. ఒకవేళ ఆమ్ ఆద్మీ పార్టీ సరైన మార్గంలో పయనిస్తే, బహుశా రాఘవ్ చద్దాతో పాటు ఇతర ఎంపీలు కూడా పార్టీని వీడేవారు కాదు అని అన్నాహజారే అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ హక్కు ఉంటుందని, బహుశా ఆ ఎంపీలు ఏదైనా సమస్యను ఎదుర్కొని ఉంటారని, అందుకే వాళ్లు పార్టీ వీడినట్లు తెలుస్తోందన్నారు. మహారాష్ట్రలోని అహల్యనగర్ జిల్లాలో రిపోర్టర్లతో అన్నాహజారే మాట్లారు. అన్నాహజారేతో కలిసి ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్యనేత కేజ్రీవాల్ అవినీతి ఉద్యమం సాగించిన విషయం తెలిసిందే. ఆప్ రాజ్యసభ ఎంపీలు
రాఘవ్ చద్దా, సందీప్ పఠాక్.. ఢిల్లీలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి.. ఆ పార్టీని వీడుతున్నట్లు వెల్లడించారు. ఆప్ రాజ్యసభ సభ్యుల్లో మూడో వంతు పార్టీని వీడుతున్నట్లు చద్దా తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీలో నాయకత్వ లోపం తలెత్తిందని, ఒకవేళ ఆ పార్టీ కనుక సరైన మార్గంలో పయనిస్తే, బహుశా వాళ్లు పార్టీని వదిలి వెళ్లేవారు కాదని అన్నాహజారే అన్నారు.

జన సంఘర్షణ
ఆదివారం 26 ఏప్రిల్ 2026

# హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కనకయ్య పర్యటన

❑ **నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రులతో భేటీ**

ఇల్లందు ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం మాటలకే పరిమితం కాకూడదని, అవి క్షేత్రస్థాయిలో అమలు కావాలంటే పాలకుల వద్ద నిరంతర పోరాటం అవసరమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నిరూపిస్తున్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ ఆయన శనివారం రాజధాని వేదికగా ముమ్మర కసరత్తు ప్రారంభించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కలను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.





**అభివృద్ధి పనులపై సుదీర్ఘ చర్చ:**

ఈ భేటీ కేవలం మర్యాదపూర్వక పలకరింపులకే పరిమితం కాలేదు. ఇల్లందు నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు, మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రత్యేక నిధుల మంజూరుపై ఎమ్మెల్యే మంత్రులతో సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గ ప్రయోజనాల కోసం రూపొందించిన ప్రణాళికలను ఆయన మంత్రులకు వివరించారు. ఎమ్మెల్యే వెంట మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి, కొత్తపేటగంధంపల్లి సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి తదితరులు ఉండి, నియోజకవర్గ పరిస్థితులను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు.

**సమన్వయమే ప్రగతికి సోపానం:**

ప్రజా ప్రతినిధులకు, పాలకులకు మధ్య ఉండాల్సిన సమన్వయానికి ఈ భేటీ ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. ఇల్లందు వంటి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కొరత రాకుండా చూడాలని, ప్రత్యేక ప్యాకేజీలు మంజూరు చేయాలని ఆయన మంత్రులను కోరారు. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చడమే తన లక్ష్యమని, అందుకోసం ప్రభుత్వంపై అవసరమైన ఒత్తిడి తీసుకువస్తానని కనకయ్య ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**నియోజకవర్గంలో ఆశలు:**

పాలనా యంత్రాంగంపై ప్రజా ప్రతినిధులు ఇలాంటి నిరంతర పర్యవేక్షణ ఉంచినప్పుడే మారుమూల ప్రాంతాల రూపురేఖలు మారుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రాజధాని పర్యటనలో మంత్రుల నుండి సానుకూల స్పందన లభించడంతో, త్వరలోనే ఇల్లందు నియోజకవర్గంలో కొత్త ప్రగతి పనులకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. ఎమ్మెల్యే చూపుతున్న ఈ చొరవ.. రేపటి ఇల్లందు భవిష్యత్తుకు ఒక గట్టి భరోసాను ఇస్తోందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జిల్లా ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణం

❑ **మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.**

బోధన్ : ఏప్రిల్ 25 జన సంఘర్షణ

నిజామాబాద్ నగరంలో ప్రజల అవసరాల కోసం ప్రతిపాదించిన ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం కేటాయించడాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనాలను పూర్తిగా పక్కనబెట్టి కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం అత్యంత విలువైన ప్రభుత్వ భూమినీ దుర్వినియోగం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతికి నిదర్శనమని అన్నారు. రాజకీయ పార్టీల కార్యాలయాలకు భూమిని కేటాయించడానికి బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేఖం కాదు కానీ నగరంలోనే కోట్ల రూపాయల విలువైన మరియు ఇదివరకే ప్రజల అవసరాల కోసం ప్రతిపాదించినటువంటి భూమిని అప్పనంగా కొట్టేయ్యడానికి మేము వ్యతిరేఖం. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్టీసీ చైర్మన్ గా ఉన్నప్పుడు నిజామాబాద్ నగరంలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని, ఆధునిక సదుపాయాలతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కోసం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఆర్ అండ్ బీ స్థలాన్ని గుర్తించి ప్రతిపదించామని ,అలాగే బస్టాండ్ నిర్మాణము కోసం 20 కోట్ల రూపాయలు కేటాయింపులు జరిగాయని తెలిపారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత అదే స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి కేటాయించడం అత్యంత దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ప్రజలకు అత్యవసరమైన రవాణా సదుపాయాలను పక్కనబెట్టి, పార్టీ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ అసలు వైఖరిని బహిర్గతం చేస్తోందని విమర్శించారు. జిల్లా కేంద్రంలో బస్టాండ్ కోసం ప్రత్యామ్నాయ స్థలం లేకపోయినా కాంగ్రెస్ పార్టీ ఈ విధమైన నిర్ణయం తీసుకోవడం సిగ్గుచేటు చర్య అని అన్నారు. ఈ కేటాయింపుల వెనుక వాణిజ్య వ్యాపారా ప్రయోజనాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, పార్టీ కార్యాలయం పేరు మీద కమర్షియల్ కంప్లెక్స్ నిర్మించి వ్యాపారం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉద్దేశ్యంగా కనిపిస్తోందని ఆరోపించారు. నిజామాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం అత్యవసరమని, ఆ స్థలంలో ప్రజలకు కావాల్సింది అత్యధునిక ఆర్టీసీ బస్టాండ్ కానీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కంప్లెక్స్ కాదు అని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ఆ స్థలాన్ని తిరిగి ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజా ఆస్తులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, వాటిని పార్టీ అవసరాలకు వినియోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

❑ **దేగాంలో మహిళ సమైక్యభవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**
❑ **రాష్ట్రములోనే మొదటి సారిగా భవన నిర్మాణమై ప్రారంభం**
❑ **సర్పంచ్ సుష్మరెడ్డి పని తీరు పట్ల అభినందన**



భైంసా, ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. శనివారం భైంసా మండలంలోని దేగాం గ్రామం లో 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన గ్రామ మహిళ సంఘభవనాన్ని ప్రారంభించిన సందర్భంగా అయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వ వాటా 10 శాతం నిధులతో సంఘ భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. భైంసా మండలానికి 40కి పైగా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్టంలో నే మొదటి సారిగా భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించినందుకు సర్పంచ్ సుష్మరెడ్డి, అధికారుల పని తీరును అయన అభినందించారు.. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలు విన్నవించడంతో దశల వారిగా గ్రామ అభివృద్ధి కి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. సిరాల ప్రాజెక్ట్ ద్వారా దేగాం ఆయకట్టుకు సాగునీరు అందించాలని కోరగా, కొన్ని చోట్ల మచ్కల్ సమీపంలో కాలువను తవ్వేశారని 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించి కాలువ ను పూర్తి స్థాయి లో నిర్మించి సాగునీటిని అందిస్తామన్నారు... అభివృద్యే ధ్యేయం గా తాను ముందుకు సాగుతున్నాని, 28 ప్యాకేజి పూర్తి అయితే నియోజకవర్గం సస్యశామలం అవుతుందన్నారు. అదే విధంగా భూగర్భజాలలను పెంచేందుకు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని డి. ఆర్. డి. ఎ. పి డి. విజయలక్ష్మి సూచించారు. అనంతరం సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి మాట్లాడుతూ తాను ఒక సామాన్య మహిళ నుండి సర్పంచ్ గా కావడం లో గ్రామస్తుల ఎమ్మెల్యే సహకారం ఎంతో ఉందన్నారు.. గ్రామ అభివృద్ధి కి దశల వారిగా నిధులు ఇస్తున్న ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు చెప్పారు.. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే కు గ్రామస్తులు, మహిళా సంఘ సభ్యులు స్వాగతించి శాలువ తో సత్కరించారు.

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో పెద్దబోయిన సునీతకు చోటు!

ఇల్లందు ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)



మారుతున్న రాజకీయ సమీకరణాల్లో మహిళల భాగస్వామ్యం కీలకమని చాటుతూ, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా పెద్దబోయిన సునీత నియామకం కావడం విశేషం. కేవలం పదవి బాధ్యతలు స్వీకరించడమే కాకుండా, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని గెలుపు తీరాలకు చేర్చడమే తన లక్ష్యమని ఆమె ప్రకటించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆమె నియామకం పట్ల కొల్లి సంజీవరెడ్డి, శాసనాల రామయ్య వంటి సీనియర్ నాయకులు హర్షం వ్యక్తం చేయగా, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజల మద్దతు కూడగట్టడమే అసలైన సవాలు అని విశ్లేషకులు భావిస్తున్నారు. మహిళా సాధికారత అనేది కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, నిర్ణయాధికార పీఠాల్లో వారికి దక్కుతున్న గౌరవం సమాజానికి ఏ విధమైన దిశను చూపిస్తుందో ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ మార్పు కేవలం ఒక పార్టీ ఎదుగుదలకు మాత్రమేనా లేక సామాజిక మార్పుకు సంకేతమా అన్నది భవిష్యత్తు కార్యచరణే నిర్ణయించనుంది.

## చమురు 'చిక్కులు': పంపిణీలో వైఫల్యం..

❑ **క్యూలైన్లలో సామాన్యుడి కష్టాలు!**

ఇల్లందు ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)



నిత్యావసరంగా మారిన చమురు సరఫరాలో చిన్నపాటి అంతరాయం ఏర్పడినా, అది సామాన్యుడి జీవనగతిని ఏ విధంగా స్తంభింపజేస్తుందో ఇల్లందులోని భద్రాద్రి వెల్ఫేర్ పోలీస్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద శనివారం నాటి దృశ్యాలే నిదర్శనం. గత కొద్దిరోజులుగా డీజిల్ నిల్వలు నిలిచిపోవడంతో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తం కాగా, శనివారం ఉదయం నిల్వలు పునరుద్ధరించిన తరుణంలో వాహనదారులు ఒక్కసారిగా ఎగబడటంతో భారీ రద్దీ నెలకొంది. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, నిత్యం రవాణాపై ఆధారపడే కార్మికులు గంటల తరబడి వేచి చూడాల్సి రావడం గమనార్హం. కేవలం నిల్వలు అయిపోయాయని చేతులు దులుపుకోవడం కాకుండా, ముందస్తు ప్రణాళికతో చమురు కొరత రాకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నిరంతర చమురు సరఫరాకు శాశ్వత చర్యలు చేపట్టాలని, ప్రజా రవాణాకు ఆటంకం కలగకుండా చూడాలని ప్రజలు భావిస్తున్నారు.

## పోలీస్ అమరవీర కుటుంబ పిల్లల చదువుల ఫీజు కోసం చెక్కు పంపిణీ

❑ **తెలంగాణ రాష్ట్ర డిజిపి ఆర్థిక సహాయం అందించిన టెర్మినస్ గ్రూపు సీ.ఎం.డి ఎస్.పి రెడ్డి**



బోధన్: ఏప్రిల్ 25 జన సంఘర్షణ

నిజామాబాద్ జిల్లాలో అక్టోబర్ 18న మరణించిన సిసిఎస్ పోలీస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ పిల్లల విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందించిన టెర్మినస్ గ్రూప్ సీఎండీ ఎస్పీ రెడ్డి ఉదారత ప్రశంసనీయమైంది. శనివారం డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి, ఐపిఎస్ చేతుల మీదుగా ప్రమోద్ కుమార్ పిల్లల ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు కోసం చెక్కును అందజేశారు. ఎస్పీ రెడ్డి తండ్రి ఎస్.ఎల్.ఎన్ రెడ్డి బోధన్ పట్టణంలో డీఎస్పీగా సేవలు అందించారు. ప్రమోద్ కుటుంబానికి సహాయం చేయాలని సంప్రదించగానే, ఎస్పీ రెడ్డి వెంటనే స్పందించి సహకరించడం ఆయన మనసు గొప్పతనాన్ని చూపిస్తుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరచిపోమని, వారి కుటుంబాలకు సాధ్యమైన అన్ని విధాలుగా అండగా నిలుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ లీకేజీలపై చైర్‌పర్సన్ సీరియస్

❑ **పనుల్లో జాప్యం వద్దు.. నాణ్యతలో రాజీ వద్దు!**



ఇల్లందు ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)

పట్టణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీ సమస్య పరిష్కారానికి మున్సిపల్ యంత్రాంగం రంగంలోకి దిగింది. రైల్వే బ్రిడ్జి సమీపంలో పైప్‌లైన్ పగిలి నీరు వృథా అవుతున్న ప్రాంతాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, కౌన్సిలర్ పింగళి అనూహ్య నరేష్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని డీఈ మురళీకృష్ణను ఆదేశించారు. కేవలం అతుకులతో సరిపెట్టకుండా, పనులు అత్యంత నాణ్యతతో ఉండాలని, పదేపదే లీకేజీలు సంభవిస్తూ ప్రజలు ఇబ్బంది పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని గట్టిగా సూచించారు. ప్రజాధనం నీటిపాలు కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు. ఒకవైపు వేసవి సమీపిస్తున్న తరుణంలో, నీటి వృథాను అరికట్టేందుకు పాలకవర్గం తీసుకుంటున్న ఈ చొరవ అభినందనీయమైనప్పటికీ, అధికారుల పనితీరులో మార్పు వస్తుందా లేదా అన్నది వేచి చూడాలి.

## లారీ రూపంలో కబళించిన మృత్యువు.. యువకుడి ప్రాణం బలి!

సత్తుపల్లి ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)



రహదారులు రక్తసిక్తమవుతున్నాయి, అజాగ్రత్త ఒక నిండు ప్రాణాన్ని గాలిలో కలిపేస్తోంది. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఒక కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది. వేంసూరు మండలం అడసర్లపాడుకు చెందిన శీలం పృథ్వీ అనే యువకుడు తన బైక్‌పై వెళ్తుండగా, రాజస్థాన్‌కు చెందిన లారీ రూపంలో మృత్యువు ఎదురొచ్చింది. అతి వేగం లేదా అజాగ్రత్త ఏదైనా కావచ్చు, కానీ ఈ ఎదురెదురు ఢీకొన్న ప్రమాదం పృథ్వీని అక్కడికక్కడే విగతజీవిని చేసింది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినప్పటికీ, పోయిన ప్రాణం తిరిగి రాదన్న సత్యం అందరినీ కలచివేస్తోంది. రాష్ట్రం దాటి వచ్చే భారీ వాహనాల వేగం, స్థానిక రహదారులపై అవగాహన లేకపోవడం తరచూ ఇలాంటి విషాదాలకు దారితీస్తున్నాయి. ఈ ఘటన కేవలం ఒక ప్రమాదం మాత్రమే కాదు, వాహనదారులు తమ వేగాన్ని నియంత్రించుకోకపోతే గమ్యం చేరాల్సిన ప్రాణాలు స్మశానానికి చేరుతాయన్న చేదు నిజాన్ని మరోసారి ఆలోచింపజేస్తోంది.

## నిజామాబాద్ జిల్లాలో సర్కిల్ ఇన్స్పెక్టర్ నుండి ఏ.సి.పి గా ప్రమోషన్

❑ **ఇన్స్పెక్టర్‌ను అభినందించిన పోలీసు కమిషనర్**




బోధన్ ఏప్రిల్ 25 జన సంఘర్షణ

తెలంగాణ రాష్ట్ర డి.జి.పి ఆదేశానుసారముగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నుండి ఏ.సి.పీ గా ప్రమోషన్ పొందారు. అలాగే పి. శ్రీశైలం, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, కలిసి అభినందనలు తెలిపారు. గత కొంతకాలంగా ప్రమోషన్ గురించి ఎదురు చూస్తున్నటువంటి స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నుండి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు ఆఫీసర్ గా ప్రమోషన్ రావడంతో ఆఫీసర్ ఆనందం వ్యక్తం చేశారని ఈ సందర్భంగా ప్రమోషన్ పొందిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ను పోలీస్ కమిషనర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రభుత్వ బడుల మనుగడ ప్రశ్నార్థకం

**❑ నిబంధనలు తుంగలో తొక్కి ప్రైవేటుకు అనుమతులా?**

ఇల్లందు ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చి, ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో ఉన్న కొందరు అధికారుల తీరు మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలలను కాపాడాల్సింది పోయి, ప్రైవేటు సంస్థల లాభాల కోసం నిబంధనలను తుంగలో తొక్కుతున్న తీరు ఇప్పుడు ఇల్లందులో చర్చనీయాంశమైంది. పట్టణంలోని నెంబర్ 2 బస్తీలో నూతనంగా ఏర్పాటు చేయ తలపెట్టిన ఒక ప్రైవేట్ పాఠశాల వ్యవహారం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. నిబంధనల ప్రకారం.. ఎక్కడైనా కొత్తగా ప్రైవేట్ స్కూల్ రావాలంటే సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలి. కానీ, ఇక్కడ విచిత్రంగా ప్రభుత్వ స్కూళ్లు పక్కనే ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా యూపీఎస్ ఇన్చార్జి 'అభ్యంతర పత్రం' జారీ చేయడం గమనార్హం. ఇది ప్రభుత్వ విద్యను అణచివేసి, పేద విద్యార్థులను ప్రైవేటు వైపు నెట్టే కుట్ర అని విమర్శలు వస్తున్నాయి. ఈ అక్రమ అనుమతులపై ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉమ్మగాని హరీష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "అధికారులు ప్రైవేటు యాజమాన్యాలతో చేతులు కలిపి ప్రభుత్వ విద్యను దెబ్బతీస్తున్నారు" అని ఆయన మండిపడ్డారు. నిబంధనలను అతిక్రమించి ఎన్ఓసీ ఇచ్చిన అధికారిపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, అలాగే ఆ ప్రైవేట్ పాఠశాల అనుమతులను రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్షర జ్ఞానాన్ని పేదలకు చేరువ చేయాల్సిన ప్రభుత్వ బడులు అధికారుల నిర్లక్ష్యంతో మూతపడే స్థితికి



చేరుకుంటే, సామాన్యుడి పరిస్థితి ఏమిటి? కార్పొరేట్ శక్తుల మోజులో పడి విద్యా వ్యవస్థను వ్యాపారంగా మారుస్తున్న తీరుపై ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ పాఠశాలల మనుగడను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# మంట పుట్టిస్తున్న 'గ్యాస్' కష్టాలు

**❑ ఏజెన్సీల ఇష్టారాజ్యంపై పర్యవేక్షణ కరువు!**

ఇల్లందు ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)

సామాన్యుడి కష్టాలపై సమరశంఖం పూరిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉమ్మగాని హరీష్ మరోసారి గొంతుకయ్యారు. ఇల్లందు పట్టణంలోని లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీలో జరుగుతున్న అక్రమాలు, వినియోగదారుల పట్ల ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యంపై ఆయన శనివారం నిప్పులు చెరిగారు. సామాన్యుడి నిత్యావసరమైన వంట గ్యాస్ పంపిణీలో ఏజెన్సీ అనుసరిస్తున్న తీరు, పారదర్శకతకు పాతరేస్తోందని ఆయన ఆరోపించారు.

**మాయమవుతున్న సిలిండర్లు.. మభ్యపెడుతున్న సందేశాలు!**

వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకుంటే, అది వారి ఇంటికి చేరకముందే 'సక్సెస్‌ఫుల్లీ డెలివరీ' అంటూ ఫోన్లకు సందేశాలు రావడం వెనుక పెను కుట్ర దాగి ఉందని హరీష్ విశ్లేషించారు. అర్హులైన సామాన్యులకు అందాల్సిన సిలిండర్లను పక్కదారి మళ్లించి, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారా? అన్న అనుమానాలను ఆయన వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా గ్యాస్ అందక ఏజెన్సీ చుట్టూ తిరుగుతున్న నిరుపేదల ఆవేదనను అధికారులు ఎందుకు పట్టించుకోవడం





లేదని ఆయన ప్రశ్నించారు. కేవైసీ అప్‌డేట్, ఫోన్ నంబర్ల మార్పు వంటి సాంకేతిక కారణాలను సాకుగా చూపి వినియోగదారులను ముప్పుతిప్పలు పెట్టడం ఏజెన్సీల ఇష్టారాజ్యానికి అద్దం పడుతోందని మండిపడ్డారు.

**అధికారుల మౌనం.. అక్రమార్కులకు వరం!**

పౌరసరఫరా వ్యవస్థలో ఇంతటి గందరగోళం నెలకొన్నా, స్థానిక రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడం వెనుక మర్మమేమిటని హరీష్ నిలదీశారు. ఏజెన్సీల నిర్లక్ష్యం వల్ల సామాన్యుడు కట్టెల పొయ్యిని ఆశ్రయించాల్సిన దుస్థితి వస్తోందని, ఇది ప్రభుత్వ ఆశయాలకే విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ రికార్డులను తనిఖీ చేసి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ మళ్లింపును అరికట్టి, ప్రతి వినియోగదారుడికి గడువులోగా గ్యాస్ అందేలా చూడకుంటే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# మిషన్ భగీరథకు లీకేజీల శాపం

**❑ బాధితులకు అండగా నిలిచిన పింగళి నరేష్!**

ఇల్లందు ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)

ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం 'మిషన్ భగీరథ' నిర్వహణ లోపాలు ఇల్లందులో సామాన్యుల పాలిట శాపంగా మారుతున్నాయి. పట్టణంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో ప్రధాన పైప్‌లైన్ ఒక్కసారిగా లీకేజీ కావడంతో భారీగా నీరు రోడ్లపైకి, పరిసర ఇళ్లలోకి చేరింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే బీఆర్ఎస్ నాయకుడు పింగళి నరేష్ క్షేత్రస్థాయికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నీటి ఉధృతికి దెబ్బతిన్న ఇళ్లను, నష్టపోయిన కుటుంబాలను ఆయన స్వయంగా పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

**నిర్వహణ వైఫల్యంపై నిప్పులు:**

ఈ సందర్భంగా అధికారుల తీరుపై పింగళి నరేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పట్టణంలో తరచూ ఏదో ఒక చోట పైప్‌లైన్లు పగులుతూనే ఉన్నాయని, ఇది కేవలం అధికారుల పర్యవేక్షణ లోపమేనని ఆయన మండిపడ్డారు. వేల లీటర్ల శుద్ధి చేసిన జలాలు వృథాగా రోడ్లపాలవుతుంటే, మరోవైపు ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తాత్కాలికంగా అతుకులు వేసి చేతులు దులుపుకోవడం కాకుండా, శాశ్వత ప్రాతిపదికన నాణ్యమైన పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.



**ఎమ్మెల్యే దృష్టికి సమస్య:**


ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలని పింగళి నరేష్ విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇల్లందు పట్టణంలో ఇలాంటి పైప్‌లైన్ లీకేజీ ఘటనలు పునరావృతం కాకుండా ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో, ఆస్తులతో ముడిపడి ఉన్న ఇలాంటి అంశాల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

# గ్రామ రక్షణలో 'డిజిటల్' నేత్రం

**❑ వంద మంది పోలీసులతో సమానం ఒక సిసి కెమెరా!**

కొమరారం ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కమ్యూనిటీ పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ కొమరారం గ్రామంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఇల్లందు ఎస్ డి పిఓ , గుండాల సీఐ, కొమరారం ఎస్సై ఆధ్వర్యంలో కొమరారం ప్రభుత్వ పాఠశాలలో 8 సిసి కెమెరాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో 3 సిసి కెమెరాలను శనివారం






ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్డీపిఓ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సాంకేతికత పోషించే పాత్ర కీలకమని, ఒక్క సిసి కెమెరా పనితీరు వంద మంది పోలీసుల పహారాతో సమానమని పేర్కొన్నారు. గ్రామస్తుల చొరవను అభినందిస్తూనే, గ్రామంలోకి వచ్చే అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కేవలం నిఘా వ్యవస్థల ఏర్పాటుతోనే ఆగకుండా.. ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారి, సైబర్ నేరాలు, రహదారి భద్రతపై గ్రామస్థులకు, యువతకు లోతైన అవగాహన కల్పించారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామ పెద్దలు భాగస్వాములైన ఈ కార్యక్రమం.. పోలీసులకు, ప్రజలకు మధ్య ఉండాల్సిన సమన్వయాన్ని ప్రతిబింబించింది. పౌర సమాజం మేల్కొని ఇలాంటి నిఘా నేత్రాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరరహిత సమాజం దిశగా అడుగులు వేయవచ్చని ఈ పరిణామాలు ఆలోచింపజేస్తున్నాయి.

# సెల్‌ఫోన్ వీడండి.. మైదానంలో మెరవండి!

కొత్తగూడెం ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)





"ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి క్రీడలే వెన్నెముకని, క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తే రేపటి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తుందని" కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో నియోజకవర్గ స్థాయి ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి తరం విద్యార్థులు సెల్‌ఫోన్ల మాయలో పడి శారీరక శ్రమకు దూరమవుతున్నారని, ఆ డిజిటల్ వ్యసనాన్ని వీడి మైదానాల్లో తమ ప్రతిభను చాటాలని హితవు పలికారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్నే కాకుండా, మానసిక ఒత్తిడిని తగ్గించి నూతనోత్తేజాన్ని ఇస్తాయని, ఈ సువర్ణ అవకాశాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కోరారు. జూన్ 7 వరకు సాగనున్న ఈ క్రీడా సంబరం ద్వారా యువతలో దాగి ఉన్న నైపుణ్యం వెలుగులోకి రావాలని, మైదానాలే గెలుపు పాఠాలు నేర్పే తొలి గురువులని ఆయన ఆకాంక్షించారు.

# గిరిజన యువతకు 'విదేశీ' ఉపాధి వరం!

కొత్తగూడెం ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)

స్థానిక గిరిజన యువత అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ఒక అద్భుత అవకాశం తలుపు తట్టింది. ఆస్ట్రేలియా, జర్మనీ, ఒమన్ వంటి దేశాల్లో ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా ఐటీడీఏ భద్రాచలం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. స్ప్రే పెయింటర్, వెల్డర్, నర్సుల వంటి వివిధ వృత్తుల్లో దాదాపు 500 పైగా ఖాళీలు ఉన్నాయి, వీటికి ఏడాదికి రూ.48 లక్షల వరకు ఆకర్షణీయమైన వేతనం లభించనుంది. కేవలం డిగ్రీలే కాకుండా, నైపుణ్యం ఉంటే ఆకాశమే హద్దుగా ఎదగవచ్చని ఈ నోటిఫికేషన్ నిరూపిస్తోంది. అర్హత గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఏప్రిల్ 27, 28 తేదీల్లో భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. గిరిజన గూడాల నుండి గ్లోబల్ వేదికల వరకు ఎదిగేందుకు లభిస్తున్న ఈ 'సువర్ణ అవకాశాన్ని' యువత అందిపుచ్చుకుని తమ కుటుంబాల తలరాతను మార్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



తెలంగాణ ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ.
సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, భద్రాచలం
పత్రికా ప్రకటన
భద్రాచలం,
తే: 23.04.2026

| S.No | Job Role | No.of Vacancies | Education Qualification | salary |
|---|---|---|---|---|
| 1 | Spray Painter | 100 | ITI/Diploma/Mechanical Engineering with 7 Years of Experience | ~INR 48 Lakhs per Annum |
| 2 | Panel Beater | 100 | ITI/Diploma/Mechanical Engineering with 7 Years of Experience | ~INR 48 Lakhs per Annum |
| 3 | Automotive Mechanic- Luxury cars | 100 | ITI/Diploma/Mechanical Engineering / Automotive Mechanic with 7 Years of Experience | ~INR 48 Lakhs per Annum |
| 4 | Welder | 100 | SSC/Inter/Diploma in Building /Fabrication/Mechanical/Related Trades with Minimum 5 Years of Experience | ~INR 48 Lakhs per Annum |
| 5 | Transmission Line Technician | 20 | ITI/Diploma/ Bachelors with Minimun 2 Years of Experience | ~INR 36 Lakhs per Annum |
| 6 | Electrician | 120 | ITI/Electrician with minimum 2 Years of Experience | ~INR 33 Lakhs per Annum |
| 7 | Nurses | 90 | BSC Nursing/GNM | ~INR 24 Lakhs per Annum |

ప్రాజెక్ట్ అధికారి,
ఐ.టి.డి.ఎ, భద్రాచలం

# వైద్య సేవల్లో భాగస్వాములు కావాలనుకునే వారికి సువర్ణావకాశం!

కొత్తగూడెం ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగం సరిహద్దు ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని చర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఒక ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల కావడం నిరుద్యోగ నిపుణులకు ఒక గొప్ప అవకాశం. కేవలం ఇదొక ఉద్యోగంగానే కాకుండా, మారుమూల ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య నిర్ధారణ పరీక్షలను అందించి వారి ప్రాణాలను కాపాడే ఒక సామాజిక బాధ్యతగా అభ్యర్థులు గుర్తించాలి. అర్హత కలిగిన వారు ఈ నెల 29 సాయంత్రం 5 గంటల లోపు ఓల్డ్ పాల్వంచలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉన్న జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయంలో తమ దరఖాస్తులను స్వయంగా సమర్పించాల్సి ఉంటుంది. వృత్తి పట్ల నిబద్ధత కలిగి, ప్రజారోగ్య వ్యవస్థలో మార్పు తీసుకురావాలనే తపన ఉన్నవారు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని, పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://కొత్తగూడెం.తెలంగాణ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌ని సందర్శించాలని సీనియర్ అధికారులు కోరుతున్నారు.

# ఆర్టీసీ కార్మికుల సుదీర్ఘ నిరీక్షణకు తెర

**❑ ప్రభుత్వ చర్చలు సఫలం - ప్రజా రవాణాలో నూతన అధ్యాయం!**

కొత్తగూడెం ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికుల చిరకాల స్వప్నాలు నెరవేరుస్తూ ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలప్రదం కావడం శుభపరిణామమని, ఇది కార్మిక శక్తి సాధించిన విజయమని సీనియర్ నాయకులు అభివర్ణిస్తున్నారు. ముఖ్యంగా 11 శాతం ఫిట్‌మెంట్‌ను ఖరారు చేయడం, సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియపై ప్రత్యేక కమిటీని వేయడం, ప్రజాస్వామ్యబద్ధంగా గుర్తింపు సంఘాల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వంటి నిర్ణయాలు ఆర్టీసీ భవిష్యత్తును మార్చనున్నాయి. ఈ చారిత్రాత్మక సందర్భంపై ఎగ్జిక్యూటివ్ మెంబర్ భట్టు మురళి నాయక్, పెద్దమ్మగుడి ధర్మకర్త, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భూక్యా గిరి ప్రసాద్ స్పందిస్తూ.. కార్మికుల కష్టాలను గుర్తించి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలు ప్రశంసనీయమని హర్షం వ్యక్తం చేశారు. అలాగే ప్రాణత్యాగం చేసిన శంకర్ రావు కుటుంబానికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడం మానవీయ కోణంలో తీసుకున్న గొప్ప నిర్ణయమని వారు పేర్కొన్నారు. హక్కుల కోసం చేసే పోరాటం ఎప్పుడూ వృథా పోదని, పాలకుల చిత్తశుద్ధి ఉన్నప్పుడు వ్యవస్థలు బలోపేతమవుతాయని ఈ పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఇప్పుడు కార్మికులు రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాల్సిన బాధ్యత ఉంది.

# ఏలూరి ఆశయ సాధనే అణగారిన వర్గాలకు రక్షణ కవచం

**❑ కామ్రేడ్ వర్ధంతి సభలో సీపీఎం నినాదం**

ఇల్లందు ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)



హక్కుల కోసం పోరాటం ఎలా ఉండాలో నేర్పిన ధీశాలి, కామ్రేడ్ ఏలూరి లక్ష్మీనారాయణ ఆశయాలు నేటి సమాజానికి దిక్సూచి అని సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ పేర్కొన్నారు. శనివారం తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఆయన 34వ వర్ధంతి సభలో ఏలూరి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టులపై కఠిన నిర్బంధాలు ఉన్న రోజుల్లోనే ప్రాణాలకు తెగించి భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఏలూరి చేసిన గెరిల్లా పోరాటాలను గుర్తుచేసుకున్నారు. కేవలం నివాళులర్పించడం ద్వారానే బాధ్యత తీరిపోదని, నేటి విపత్కర పరిస్థితుల్లో పేదవాడి గొంతుకగా మారడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన ఏలూరి చరిత్రను స్మరించుకోవడం.. ప్రతి కార్యకర్తలో ఒక నూతన ఉత్సాహాన్ని, ఆలోచనను రేకెత్తించింది. ఈ కార్యక్రమంలో నాగరాజు, నాగయ్య, రామ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొని ఆయన ఆశయ సాధనలో భాగస్వామ్యమవుతామని తెలిపారు.

## ప్రభుత్వ వైఖరిపై కూనంనేని ప్రశంసలు.. శంకర్ గౌడ్ త్యాగం మరువలేనిది!



◆ ఆర్టీసీలో 'ప్రజాస్వామ్య' విజయం

కొత్తగూడెం ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)

దశాబ్ద కాలంగా అణిచివేతకు గురైన ఆర్టీసీ కార్మికుల గొంతుకకు ఎట్టకేలకు మోక్షం లభించిందని, ఇది కేవలం చర్చల విజయం మాత్రమే కాదు.. కార్మిక లోకం సాధించిన ప్రజాస్వామ్య విజయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. శనివారం ఆయన ఆర్టీసీ కార్మికుల సమస్యల పై సానుకూల దృక్పథంతో పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబులకు అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వం యూనియన్లను రద్దు చేసి కార్మికులను బానిసలుగా చూసిందని, ఆ చీకటి రోజులకు స్వస్తి పలికి విలీన ప్రక్రియను వేగవంతం చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ 11% పీఆర్సీ ప్రకటించడం శుభపరిణామమని, కార్మికులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి పట్టువిడుపులతో సమస్యను కొలిక్కి తెచ్చారని ఆయన విశ్లేషించారు. అయితే, నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య తనను కలచివేసిందని, భవిష్యత్తులో యాజమాన్యం బెదిరింపు ధోరణి వీడి సామరస్యంగా వ్యవహరిస్తే ఇలాంటి బలిదానాలు ఉండవని హితవు పలికారు. ప్రభుత్వం శంకర్ గౌడ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూనే, ఆర్టీసీ పునర్వైభవం దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని ఆకాంక్షించారు. ఈ పరిణామం అణిచివేతపై సాధించిన నైతిక విజయంగా చరిత్రలో నిలిచిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఇటుక బట్టీల కార్మికుల సందర్శించిన బోధన్ సబ్ కలెక్టర్



బోధన్ ఏప్రిల్ 25 జన సంఘర్షణ

బోధన్ సబ్-కలెక్టర్ వికాస్వికాస్ మహతో మహతో ఎడపల్లి తహసీల్దార్‌తో కలిసి ఎడపల్లి మండలం, మంగళ్‌పహాడ్ గ్రామంలోని ఇటుక బట్టీల ప్రాంతాలను శని వారం రోజున సందర్శించారు. పర్యటన సందర్భంగా కార్మికులతో మాట్లాడుతూ.. లేబర్ కార్డుల కోసం వారి రిజిస్ట్రేషన్ స్థితి గురించి ఆరా తీశారు. చాలా మంది కార్మికులు అప్పటికే రిజిస్టర్ అయి ఉన్నట్లు గమనించబడింది. అర్హులైన కార్మికుల నమోదును వీలైనంత త్వరగా జరిగేలా చూడటానికి, ఒక జీపీఓ ను నియమించాలని ఎడపల్లి తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత ఇటుక బట్టీల యజమానులతో సమన్వయం చేసుకుని, అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను కల్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించడం జరిగింది, వాటిలో ఇవి కూడా ఉన్నాయి సురక్షితమైన తాగునీరు పారిశుధ్య సౌకర్యాలు మరుగుదొడ్లు సరైన జీవన పరిస్థితులు కార్మికుల సంక్షేమాన్ని నిర్ధారించడానికి, ఏఎన్ఎంల ద్వారా వారికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంపై ప్రాధాన్యత ఇవ్వబడింది. మొత్తం మీద, ఇటుక బట్టీల ప్రాంతాల్లోని కార్మికుల సంక్షేమం, భద్రత మరియు జీవన పరిస్థితులను మెరుగుపరచడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అవసరమైన సూచనలు జారీ చేయబడ్డాయి.

## మొక్కలు నాటి నటుడు బ్రహ్మాజీకి పుట్టినరోజు శుభాకాంక్షలు



కొత్తగూడెం ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)

ప్రముఖ సినీ నటుడు బ్రహ్మాజీ పుట్టినరోజును పురస్కరించుకుని, ప్రపంచ రికార్డు గ్రహీత విశ్వామిత్ర చౌహాన్ శనివారం కొత్తగూడెం అటవీ అభివృద్ధి సంస్థ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. 'వాక్ ఫర్ ట్రీస్' కాన్సెప్ట్‌తో ప్రతిరోజూ మొక్కలు నాటుతున్న ఆయన, పాల్వంచ డివిజనల్ మేనేజర్ మాధవితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్రహ్మాజీ నటించిన 'వనజీవి రామయ్య' సినిమా స్ఫూర్తితో ఈ మొక్కలు నాటినట్లు విశ్వామిత్ర తెలిపారు. అనంతరం గతంలో నాటిన మొక్కల ఎదుగుదలను వారు పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది మరియు పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం...



బోధన్ ఏప్రిల్ 25. జన సంఘర్షణ

బోధన్ పట్టణంలోని శ్రీ విజయసాయి ఉన్నత పాఠశాలలో భక్తి శ్రద్దలతో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని సమిష్టిగా హనుమాన్ చాలీసా చదువుతూ, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు సమయానికి చల్లగా కురవాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, చక్రవర్తి, ఎన్‌సీపీ శ్రీనివాస్, తదితరులు భక్తితో పాల్గొన్నారు. వారి నాయకత్వంలో విద్యార్థులు, స్థానిక భక్తులు కలిసి భక్తి గీతాలు ఆలపిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత మధురంగా మార్చారు. భక్తులంతా "శ్రీ ఆంజనేయ స్వామి కృపతో గ్రామాలు సస్యశ్యామలంగా మారాలి, ప్రజలందరూ ఆరోగ్యంగా ఆనందంగా జీవించాలి" అంటూ ప్రార్థనలు చేశారు. కార్యక్రమం ముగింపులో హనుమాన్ ఆశీస్సులతో అందరికీ శుభం కలగాలని కోరుతూ మంగళహారతులు నిర్వహించారు.

# హాజీపూర్ తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఎల్లారెడ్డి, ఏప్రిల్ -25 (జన సంఘర్షణ)

ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండాలో శనివారం సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ రతన్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులనకు తక్కువ ధరలకు అమ్మి నష్టపోకుండా జాగ్రత్త పడాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు తగతిన జరిగిన ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి కింటల్ కు రూపాయలు 2389, బి గ్రేడ్ ధాన్యానికి 2,369 రూపాయలు మద్దతు ధర ప్రభుత్వం తెలిపిందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎరుకల శివరాములు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# దౌలతాబాద్‌లో ఘనంగా డా.బీఆర్ అంబేద్కర్ జయంతి



ముధోల్, ఏప్రిల్ 25 (జన సంఘర్షణ)

తానూర్ మండలంలోని దౌలతాబాద్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాబా సాహెబ్ అంబేద్కర్, గౌతమ బుద్ధుడు చిత్రపటానికి నాయకులు, సంఘ నాయకులు, గ్రామస్తులు పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. దేశంలో అంబేద్కర్ చేసిన సేవలు మరువలేనిదని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరిగేలా రాజ్యాంగాన్ని రూపొందించారని అన్నారు. ఆ మహానుభావుడి ఆశయాలు కొనసిసాగద్దామని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలతో శోభాయాత్ర నిర్వహించారు. యువకులు , మహిళలు బాబాసాహెబ్ పాటల మీద నృత్యం చేస్తూ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వన్నేకర్ విజయ్, గ్రామ సర్పంచ్ అనిత, చంద్రకాంత్, నిఖిల్, రాహుల్, సంకేత్, రాజు, అభిజిత్, చంద్రకాంత్, భగవాన్, విశాల్, మోహనేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత సామాజిక బాధ్యత

◆ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్



బోధన్ ఏప్రిల్ 25జన సంఘర్షణ

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈరోజు తెలంగాణ యూనివర్సిటీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి రాంబాబు అధ్యక్షతన ఆధ్వర్యంలో డిచ్ పల్లి సబ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ ఆరిఫ్, స్టేషన్ సైబర్ సెక్యూరిటీ ఇంచార్జ్ నిర్మల జ్యోతి హాజరై మహిళా ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి రాంబాబు మాట్లాడుతూ మహిళల హక్కుల రక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదని పేర్కొన్నారు. ఆరిఫ్ మాట్లాడుతూ పనిచేసే చోట మహిళా ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత రైడ్రెసల్ సెల్ కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి తో పాటు సెల్ డైరెక్టర్ డాక్టర్ భ్రమరాంబిక, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎష్ట. ఆరతి, వివిధ విభాగాల టీచింగ్, నాన్ టీచింగ్ మహిళా ఉద్యోగులు హాజరయ్యారు.

## కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు



బోధన్: ఏప్రిల్ 25 జన సంఘర్షణ

తెలంగాణ వర్సిటీ పరిధిలో డిగ్రీ రెగ్యులర్/ బ్యాక్ లాగ్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయని అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంట. చంద్ర శేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 29 పరీక్ష కేంద్రాలలో 7487 మంది అభ్యర్థులకు గాను 7199 మంది అభ్యర్థులు హాజరు కాగా 287 మంది గైర్హాజర్ అయ్యారని, నిజామాబాద్ లోఒకరు డిబార్ అయ్యారని ఆయన తెలిపారు. ఉదయం జరిగిన ఆరవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష కు 4460 మంది విద్యార్థులకు గాను 4322 మంది హాజరు కాగా 137 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన మొదటి సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షకు 3027 మందికి గాను 2877 మంది హాజరు కాగా 150 మంది గైర్ హాజరయ్యారు. నిజామాబాద్, కామారెడ్డి ,ఆర్మూర్ లోని పలు పరీక్షా కేంద్రాలను అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంట. చంద్ర శేఖర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య కె.సంపత్ కుమార్,అకడమిక్ ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్. అతిక్ సుల్తాన్ లతో రెండు ప్రత్యేక బృందాలు గా ఏర్పడి పర్యవేక్షించారు.

# ఆస్తి పన్ను చెల్లింపులో రెండో వార్డు ముందంజ

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -25(జన సంఘర్షణ )

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ రెండో వార్డులో ప్రజలు ఆస్తి పన్ను చెల్లింపులో ముందంజలో నిలుస్తున్నారు. మున్సిపల్ కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరి విద్యాసాగర్ ప్రత్యేక చొరవతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పన్నులు సకాలంలో చెల్లించాల్సిన అవసరాన్ని వివరించారు. మున్సిపల్ అభివృద్ధి పనులు సమర్థంగా కొనసాగాలంటే పన్నుల చెల్లింపులు కీలకమని ఆయన తెలిపారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిస్తే, మున్సిపల్ అధికారులు కూడా సమస్యల పరిష్కారంలో ముందుండి సహకరిస్తారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమకు ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటిని మున్సిపల్ చైర్మన్ మరియు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రెండో వార్డ్ ప్రజలు కూడా ఈ పిలుపునకు స్పందిస్తూ, పన్నులు సకాలంలో చెల్లిస్తూ మున్సిపల్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పద్మశ్రీకాంత్, ఆస్తి పన్ను చెల్లింపులో ముందుండేలా ప్రజలను ప్రోత్సహించిన కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరి విద్యాసాగర్‌ను అభినందించారు.



# కాలనీ వాసులకు అందుబాటులో మంచినీటి సౌకర్యం ఏర్పాటు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -25(జన సంఘర్షణ )

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ రెండో వార్డులో గత కొన్ని రోజులుగా నెలకొన్న నీటి ఎద్దడి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, స్థానికులు కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరి విద్యాసాగర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన కౌన్సిలర్, నిరుపయోగంగా ఉన్న నీటి వనరును పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరి విద్యాసాగర్ మాట్లాడుతూ.. రెండో వార్డు ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా ఒక్క ఫోన్ కాల్ చేస్తే వెంటనే స్పందించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు మంచిర్యాల విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ నాయకులు సుజిత్, కాలనీవాసులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
ఆదివారం
26 ఏప్రిల్ 2026

# కవిత కొత్త పార్టీ.. 'తెలంగాణ రాష్ట్ర సేన' ఆవిర్భావం.. కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు!!

- **తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన కవిత**
- **బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయిందన్న ఆరోపణ**
- **కేసీఆర్ మారిపోయారని, ఆయన మన మనిషి కాదంటూ తీవ్ర విమర్శలు**
- **సామాజిక తెలంగాణే లక్ష్యమని, రెండేళ్లలో అధికారంలోకి వస్తామని ధీమా**
- **తప్పకుండా తెలంగాణకు ముఖ్యమంత్రిని అవుతానని స్పష్టం చేసిన కవిత**

మేడ్చల్/ఏప్రిల్25/(జన సంఘర్షణ)

తెలంగాణ రాష్ట్ర సేన' (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాంచజన్యం పేరుతో ఐదు హామీలను ప్రకటించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె పార్టీ పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కీలకమైన ఐదు హామీలను అమలు చేస్తామని తెలిపారు. విద్య: ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లోనూ ఉచిత విద్యను అందిస్తామని ప్రకటించారు. విద్యకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని, కానీ నాడు కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేశారని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అదే దారిలో నడుస్తున్నారని మండిపడ్డారు. వైద్యం: ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ప్రైవేటు ఆసుపత్రిలో కూడా ఏ వ్యాధికి అయినా ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. వ్యవసాయం: రైతును రాజుగా చేయడమే తమ ప్రభుత్వం లక్ష్యమని కవిత తెలిపారు. ప్రస్తుతం ఏ బ్యాంకుకు లేదా ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా సూటు బూటు వేసుకుని వస్తే కుర్చీ మీద కూర్చోబెట్టి గౌరవిస్తారని, కానీ రైతుకు మాత్రం సరైన గౌరవం ఇవ్వడం లేదని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక రైతుకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఉపాధి: ప్రస్తుతం ప్రభుత్వాలు యువతకు ఉద్యోగాలు ఇస్తామని చెబుతున్నాయని, కానీ ఉపాధిపై దృష్టి సారించడం



లేదని కవిత ఆరోపించారు. తమ ప్రభుత్వం వస్తే ఉపాధి కోసం యువతకు రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు.సామాజిక న్యాయం: తమ ప్రభుత్వంలో సామాజిక న్యాయం పాటిస్తామని కవిత చెప్పారు. తాను తల్లి స్థానంలో ఉన్నానని కాబట్టి తాను జేబు చూడనని, తెలంగాణ ప్రజల బాగోగులు చూస్తానని తెలిపారు. సామాజిక తెలంగాణను సాధించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం జరగాల్సిందే అన్నారు. అగ్రకులాల్లోని పేదలను కూడా ఆదుకుంటామని అన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. టీఆర్ఎస్ తెలంగాణ ప్రజల ముంగిటకు వస్తోందని, సామాజిక న్యాయం తెస్తుందని వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ రాజకీయాలతో పాటు ప్రజాపోరాటాలు చేస్తుందని కవిత తెలిపారు.

# అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీలకు గవర్నర్ ఆమోదం

- **అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీలకు గవర్నర్ ఆమోదం**

హైదరాబాద్ /ఏప్రిల్25/(జన సంఘర్షణ)

అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్ అయింది. వీరి ఎమ్మెల్సీ పదవులకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆమోదం తెలిపారు. గవర్నర్ కోట కింద అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. గతంలో గవర్నర్ ఆమోదము తెలుపకపోవడంతో నూతనంగా వచ్చిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల శనివారం వీరిద్దరికి ఎమ్మెల్సీ గా విధులు నిర్వహించడానికి ఆమోదముద్రం తెలిపింది. ఈనెల 30 తేదీ వరకు వీరికి అవకాశం ఉండడంతో, చివరికి గవర్నర్ ఆమోదంతో దీనిపై నెలకొన్న ఉత్కంఠ కు తెర పడింది.



# సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు

నిజామాబాద్ : ఏప్రిల్ 25 జన సంఘర్షణ


నేడు నిజామాబాదు పోలీస్ కమిషనరేట్, నిజామాబాదు సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిజామాబాద్ పాత కలెక్టర్ గ్రౌండ్ యందు ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ ప్రీమియర్ లీగ్ లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, యోగా వంటి విభిన్న క్రీడల్లో ఏప్రిల్ 20 నుండి 28 వరకు జరగనున్న ఈ పోటీలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించి, టార్చ్ ర్యాలీ, క్రీడల పతాక ఆవిష్కరణ, మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా క్రమశిక్షణ , ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి క్రీడల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి, అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారని షబ్బీర్ అలీ వివరించారు. అలాగే ప్రతి జిల్లాలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ, స్టేడియాలు, కోచింగ్ సెంటర్లు, జిమ్నేషియంలను అభివృద్ధి చేస్తోందని చెప్పారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు, ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తును భద్రపరచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ... యువత , క్రీడాకారులు వేసవిలో చెడు అలవాట్ల బారిన పడకుండా నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ మంచి కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఎన్ఎస్ఎల్లో పోలీసులే కాకుండా సేవాభావం కలిగిన ప్రముఖులను కౌన్సిల్లో చోటు కల్పించి ముందుకు సాగడం మంచి పరిణామం అన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొనాలని తెలిపారు. నగరంలో సింథటిక్ ట్రాక్తో కూడిన స్టేడియం నిర్మాణం చేపట్టాలన్నారు. స్టేడియం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. అనంతరం నిజామాబాద్ నగర మేయర్ మాట్లాడుతూ... ఎన్ ఎస్ సి ప్రీమియర్ లీగ్ క్రీడలు నిర్వహించడం ఎంతో సంతోషకరమైన అంశం అని క్రీడలు అనేవి యువతకు ఎంతో మెరుగు పడటానికి దోహదపడతాయని తెలిపారు. తదుపరి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... యువత, విద్యార్థుల్లో మొబైల్ నుంచి, మత్తు పానీయలకు దూరంగా ఉంచడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని సీపీ తెలిపారు. ప్రతినిత్యం క్రీడల్లో సాధన చేయడం ద్వారా క్రమశిక్షణ, పట్టుదలతో పాటు మంచి నాయకత్వం అలవాడుతుందన్నారు. క్రీడల్లో పాల్గొంటే శారీరక దృఢత్వంతో పాటు మంచి ఆరోగ్యం మీ సొంతం అ వుతుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, టోర్నమెంట్లో పాల్గొంటే మంచి స్నేహ సంబంధాలు పెరుగుతాయన్నారు. అవకాశం



వచ్చిన దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 20 నుంచి ఉమెన్స్ కళాశాల మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందని, ఈ రోజు నుంచి 28వరకు కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్బాల్, యోగా పోటీలు ప్రారంభమయ్యాయని తెలిపారు. సే నో టు డ్రగ్స్ సే ఎస్ టూ స్పోర్ట్స్ అనే నినాదంతో యువత ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య, ఐపీఎస్, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనా రాయణ, నగర మేయర్ కూరగాయల ఉమారాణి, అడిషనల్ డిసిపి (అడ్మిన్ ) శుభం ప్రకాష్, ఐ. పి. ఎస్, అదనపు డీసీపీ (ఏఆర్) శ్రీ రామచంద్ర రావు, కౌన్సిల్ ప్రధానకార్యదర్శి డాక్టర్ కవితారెడ్డి, సంయుక్త కార్యదర్శిలు రజనీకాంత్, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఉష, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్, సిటిసి ఏసీపీలు, సిఐలు ఎస్సైలు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నగేష్రెడ్డి, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పద్మావతి శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం ఏర్పాట్లకు ముస్తాబు

నిజామాబాద్ /ఏప్రిల్25/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం అక్బర్ నగర్లో శివారులోని శ్రీ పద్మావతీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం అంగరంగ వైభవంగా శ్రీ పద్మావతి శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం నిర్వహించడానికి ఉత్సవ కమిటీ జయశంకర్ ప్రాంతీయ చెఱకు వరి పరిశోధన స్థానం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 26-04-2026 రోజున ఉదయం 10-45 గంటలకు మఖ నక్షత్రయుక్త మిథునలగ్న పుష్కరాంశమున శ్రీ పద్మావతీ వేంకటేశ్వర స్వాముల వారి కళ్యాణ మహోత్సవం, వేద పండితులు నిశాంత్ పంతులు, బ్రహ్మశ్రీ శ్రీనివాస్ శర్మ, బ్రహ్మశ్రీ రామారావ్ జ్యోషి, విష్ణు శర్మ, రోహిత్ శర్మ రుద్రూర్ యజ్ఞకముతో తో శ్రీ పద్మావతి శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ నేత్రపర్వంగా నిర్వహించడానికి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈ ఆలయంలో పద్మావతి, వెంకటేశ్వర స్వామి, తో పాటు గోదాదేవి విగ్రహాలు ఉన్నాయి. ఈ కళ్యాణం తిలకించడానికి రుద్రూర్ మండల ప్రజలే కాకుండా, అక్బర్ నగర్, వర్ని, చందూర్, నస్రుల్లాబాద్ మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి కళ్యాణం తిలకించి పునీతులవతారు. అనంతరం బాలయోగి పిట్ల కృష్ణ మహారాజ్ మల్లారం ప్రవచనం ఉంటుందని, ఆలయ ఉత్సవకమిటి శ్రీ పద్మావతీ వేంకటేశ్వర స్వామి దేవాలయము ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంతీయ చెఱకు, వరి పరిశోధన స్థానము, వీరాపురం, మండలం రుద్రూర్, నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ఎంతో ఘనంగా కొనసాగుతాయి.తిగుల్ల గంగామణి రాజ వరప్రసాద్లోవ్ తెలిపారు.

**ఆలయ విశిష్టత** : 17వ శతాబ్దంలో కాకతీయ రాజులు రుద్రూర్‌లో కోట ఏర్పాటు చేసుకొని అక్కడి పరిపాలన చేసేవారని. ఆ సమయంలో రాణి రుద్రమ్మ రుద్రూర్ కోటకు నాలుగు స్వరంగాలు మార్గాలు ఉండడం వల్ల అప్పట్లో అక్బర్ నగర్ అనే పిలవబడే ఈ గ్రామం వీరాపురం గ్రామంలో పేరుగాంచింది. దండకారణ్యం అడవులు విస్తరించి ఉండటంతో రాణి రుద్రమ్మ ప్రతిరోజు సొరంగం మార్గం ద్వారా ఈ ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించేవారు అని పూజారులు వెల్లడించారు. ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి మూల విరాటుడు భక్తులకు దర్శమిస్తుండగా , ఆలయం బయటఇరువైపులా శ్రీదేవి భూదేవి సమేతంగా గర్భగుడి బయట గెలవడం జరిగింది. గర్భగుడిలో శ్రీనివాసుడు విగ్నేశ్వరుడు మాత్రమే ఉన్నారు. 1932లో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరగడంతో అప్పట్లో అక్బర్ అనే ఓ అధికారి ఈ ఆలయం నుంచి నిజాంసాగర్ కాలువ ఏర్పాటుచేసి 400 ఎకరాల భూములకు సాగునీరు అందించడానికి ఈ పంట కాలువ ఏర్పాటు చేశారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఈ వీరాపురం ఉండడం వల్ల ఈ గ్రామాన్ని వర్నిబిబోధన్ ప్రధాన రహదారి పక్కకు తీసుకురావడంతో వీరాపురం గ్రామం అక్బర్ నగర్ గ్రామంగా ఏర్పాటు అయింది. బోధన్ నుంచి వర్ని మండలానికి వెళ్లే ప్రధాన రహదారి అక్బర్ నగర్ వద్ద 500 మీటర్ల దూరంలో ఈ ఆలయం కొండపై వెలిసింది. ఈ ఆలయానికి రావడానికి బస్సు సౌకర్యం, ప్రైవేట్ వాహనాలు, సొంత వాహనాలు వెళ్లడానికి మార్గాలు ఉన్నాయి.

# జీవోకాపీని అధికారులకు అందజేసిన ఆర్ వై సభ్యులు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -25(జన సంఘర్షణ )



వైశ్యుల ఆరాధ్య దేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో కాపీని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, తాసిల్దార్ ప్రేమ్ కుమార్, మున్సిపల్ మేనేజర్ వాసంతి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సిద్ది శ్రీధర్ గుప్తా ఆధ్వర్యంలో వైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు శనివారం అందజేశారు. అనంతరం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి రానున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో 67 మేరకు ప్రతి సంవత్సరం వైశాఖ శుక్లపక్ష దశమి రోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపనున్నట్లు అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చర్చలు సఫలం.. ఆర్టీసీ సమ్మె విరమణ..?

హైదరాబాద్ /ఏప్రిల్25/జన సంఘర్షణ/



ఆర్టీసీ జేఏసీతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రుల బృందం శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు సుదీర్ఘంగా చర్చలు కొనసాగాయి. చివరికి ఆర్టీసీ జేఏసీ 32 అంశాలను మంత్రుల బృందం ముందుకు తీసుకువెళ్లగా, 29 అంశాలకు ఆమోదించిన మంత్రుల బృందం, మూడు అంశాలపై తర్జనభర్జన కొనసాగింది. చర్చలు సఫలం 10శాతం పి ఆర్ సి. ప్రభుత్వం లో ఆర్టీసీ విలీనంసంఘాల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఆమోదముద్ర వేసింది. మిగిలిన అంశాల పరిష్కారానికి అంగీకరించిన ఆర్టీసీ యాజమాన్యం.

# హైదరాబాద్‌లో రోడ్డెక్కిన ఆటో డ్రైవర్లు

- **నిన్న ఆర్టీసీ డ్రైవర్లు.. ఇవాళ ఆటో డ్రైవర్లు**
- **ఎంజే మార్కెట్ చౌరస్తాలో ఆటో డ్రైవర్ల నిరసన**

హైదరాబాద్/ఏప్రిల్25/(జన సంఘర్షణ)



డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన ఆటో డ్రైవర్. ఆటో మీటర్‌పై ఛార్జీలు పెంచడంతోపాటు.. జిల్లా ఆటోలను హైదరాబాద్‌లోకి పర్మిషన్ ఇవ్వొద్దంటూ నిరసనసీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు. గంట నుండి కొనసాగుతున్న ధర్నా.. భారీగా నిలిచిపోయిన వాహనాలు.

# కవిత కొత్త పార్టీ ప్రకటన... "తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)"గా పేరు వెల్లడి

హైదరాబాద్ /ఏప్రిల్25/(జన సంఘర్షణ)




రాష్ట్ర రాజకీయాల్లో కొత్త మార్పులకు నాంది పలుకుతూ ఎమ్మెల్సీ కవిత కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కొత్త రాజకీయ పార్టీ పేరును అధికారికంగా ప్రకటించారు. "తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)" అనే పేరుతో ప్రజల ముందుకు వస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కవిత మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ లక్ష్యాలను మరింత బలోపేతం చేయడమే తమ పార్టీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, రైతుల సంక్షేమం, మహిళల సాధికారత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించేలా తమ పార్టీ పని చేస్తుందని స్పష్టం చేశారు.ఈ ప్రకటనతో తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి. కవిత కొత్త పార్టీ ఎలాంటి ప్రభావం చూపుతుందనే దానిపై రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# ట్రాఫిక్ పై అవగాహన సదస్సు




**రామగుండం,ఏప్రిల్ 25**

స్థానిక లక్ష్మీ నగర్ ఏరియాలో గల షాపు యజమానులకు,స్థానిక ప్రజల కు ట్రాఫిక్ పై అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా రామగుం డం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.రాజేశ్వర రావు మాట్లాడు తూ షాపు యజమానులకు షాపుకు వచ్చే ప్రజలకు వారి వాహనాలను శాపుల ముందు పార్కింగ్ చేయరాదని,శాపు ముందు రోడ్డుకు మీద ఎలాంటి వస్తువులను గాని పెట్టరాదని వారికి వివరించడం జరిగింది. మరియు టూవీలర్ నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఫోర్ వీలర్ నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని వాహనానికి సంబంధించిన పత్రాలు అన్ని ఉంచుకోవాలని ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వారికి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్సై జి.హరి శేఖర్ మరియు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత



**వలిగొండ ఏప్రిల్ 25**

వలిగొండ మండల కేంద్రంలో శని వారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్య క్షులు పోలేపాక జానకి రాములు ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు.వల్లాల వాణి 60000,వూర సైదమ్మ 28,000, గొలుసుల లక్ష్మయ్య 21000, రేగు మల్లేశం 32000 రూపాయల చెక్కులను అందుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్లు సుంకి మహేందర్,కూర శ్రీనివాస్, బత్తిని నాగేష్ గౌడ్,ఎల్లంకి నాగమణి, గొలుసులోశాంతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏమ్మె మల్లేశం, అయిటిపాముల రవి,పోలేపాక శంకర్, తదితరులు పాల్గొన్నారు.ద

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత : గాజులపల్లి సర్పంచ్ పంజా స్వామి.



**దౌల్తాబాద్ ఏప్రిల్ 25**

ఎమ్మెల్సీ యాదవ రెడ్డి సహకారంతో తోగుట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గంగి చంద్రం కు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.13,500 చెక్కును గాజులపల్లి గ్రామ సర్పంచ్ పంజ స్వామి అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అవసరంలో ఉన్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వం తీసుకుంటున్న మంచి చర్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రేమ్ కుమార్, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

# 40 ఏళ్లకు పైబడిన ఓటర్ల వివరాలు సేకరించండి

-బీఎల్ ఓలు,సూపర్ వైజర్లు విధిగా ఈకార్యక్రమంలో పాల్గొనాలి

-ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్ ఆదేశాలు

**ఉప్పల్ :**

ప్రతి బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ ఓ)సూపర్ వైజర్లు తన పరిధిలో పోలింగ్ స్టేషన్ల ప్రాంతాల్లో ప్రస్తుత ఓటరు జాబితాలోని 40 ఏళ్లకు పైబడిన ఓటర్లందరి ఇళ్లకు వెళ్లి వారి వివరాలు సమగ్రంగా సేకరించాలని ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్ ఆదేశించారు. శు క్రవారం ఉప్పల్ లోని తన కార్యాలయంలో ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్ ప్రతి బూత్ లెవెల్



ఆఫీసర్లు (బీఎల్ ఓ), సూపర్ వైజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 362 నుంచి 407 వరకు గల పోలింగ్ స్టేషన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఓటర్ల వివరాల సేకరణ జరగాలని సూచించారు.(బీఎల్ ఓ), సూపర్ వైజర్లు అందరూ విధిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. వివరాలను సమగ్రంగా సేకరించిన అనంతరం నివేదికను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉప్పల్ డిప్యూటీ తహశీల్దార్ శ్రీ పాల్,ఉప్పల్ ఆర్ఐలు ఎం.అశ్విని గౌడ్,ఎ.వీరేంద్ర సాయి, సీనియర్ అసిస్టెంట్ నైదా,సర్వేర్ వెంకన్న జూనియర్ అసిస్టెంట్ లు ఎం,అనంత రాములు, సాయినాద్ రెడ్డి,అంజిరెడ్డి, పి.వెంకన్న,ఎం,అలివేలు, వనిత,స్వాతి,బీఎల్ ఓ), సూపర్ వైజర్లు,అటెండర్స్ సత్యనారాయణ,సంజీవ, రెవెన్యూ సిబ్బంది,పాల్గొన్నారు,

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్కు నివాళులు

- అంత్యక్రియల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేత
- వెంకటరాములు కుటుంబానికి అండగా ఉంటామని ఎస్పీ భరోసా

**జహీరాబాద్:**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ మాసాని వెంకటరాములు అంత్యక్రియలకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హాజరై నివాళులు అర్పించారు. నారాయణఖేడ్లో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శిం



చి, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వెంకటరాములకు రావల సిన అన్ని రకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కాగా, జహీరాబాద్ రూరల్ పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న వెంకట రాములు ఏప్రిల్ 23న నారాయణఖేడ్ నుంచి



జహీరాబాద్కు వెళ్తుండగా న్యాల్కల్ మండలం చాల్కి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ సైదా నాయక్, సి ఐ శివలింగం, ఎస్ఐ కాశీనాథ్ యాదవ్,శ్రీనివాస్ రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి సంతాప సూచికంగా మౌనం పాటించిన గని కార్మికులు

:- శంకర్ గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలి.

:- ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను.

**రామగుండం,ఏప్రిల్ 25**

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22 నుంచి జరిగిన ఆర్టీసీ సమ్మె సందర్భంగా నర్సంపేట డిపో కు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 23 న తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మ హత్య చేసుకోగా,వైద్యం అందించే లోపే మృతి చెందిన విషయం తెలిసిందే.ఆయన మృతి కి సంతాప సూచకంగా శనివారం అర్జీ వన్ ఏరియా లోని గనులు, డిపార్ట్మెంట్స్,ఓసిపి 5 లలో గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆద్వర్యంలో కార్మికులతో కలిసి ఒక్క నిమిషం మౌనం పాటిం చి నివాళులు అర్పించడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్



ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు.అనంతరం ఆయన జిడికే 2ఏ ఇంక్లైన్ లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ శం కర్ గౌడ్ మృతి బాధాకరమని ఆయన పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ముందు ఇచ్చిన కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె నోటీసుపై చర్చించి పరిష్కారం చూప కుండా సమ్మెకు పోవడం వల్ల నిర్లక్ష్యం చేయడం వల్లె శంకర్ గౌడ్ మృతి చెందాడని,ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే నని ఆయన ఆరోపించారు.కార్మికులు ఆర్టీసీ అభివృద్ధి కోసం కృషి చేస్తూ లాభాలు గడించిన రాష్ట్ర ప్రభుత్వం,యాజమాన్యం వారి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయడం వల్ల ఒక నిండు ప్రాణం బలి అయిందని,ఇది యాజమాన్యం ప్రభుత్వం అతని మృతి కి బాధ్యత వహించి వారి కుటుంబానికి న్యాయం చేసి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్ మరియు పిట్ కార్యదర్శులు సంకె అశోక్,బోగ సతీష్ బాబు,మానాల శ్రీని వాస్,పొన్నాల వెంకటయ్య,కారంపూరి వెంకన్న,చంద తిరుపతి,భక్తి శ్రీనివాస్,అటికేటి రాజు,బొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్వీయ గణనకు ఆన్ లైన్ సౌకర్యం

:- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగర కమిషనర్ జె అరుణ శ్రీ

**రామగుండం,ఏప్రిల్ 25**

జన గణన -2027 లో భాగంగా ఆదివారం నుండి స్వీయ గణన కార్యక్రమం ఆరంభం అవుతుందని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) ,రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 9.00 గంటలకు నగర పాలక సంస్థ కార్యాల యంలో ప్రారంభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.స్వీయ గణన లో భాగంగా ప్రజలే తమ వివరాలను తామే నమోదు చేసుకునే సౌకర్యం ఆన్ లైన్ లో ఏప్రిల్ 26, 2026 నుండి మే 10,2026 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.స్వీయ గణన చేసుకోవడానికి ముందుగా ఆన్లైన్ లో https://se.census.gov.in అనే లింక్ తెరిచి సెల్ఫ్ ఎన్యూమరేషన్ ( హెచ్ ఎల్ ఓ ) లాగిన్ వద్ద తెలంగాణ ఎంపిక చేసి, క్యాప్చ ఎంటర్ చేసి వెరిఫై & ప్రొసీడ్ క్లిక్ చేస్తే వెల్ కమ్ పేజీ తెరుచు కుంటుందని అన్నారు. ఈ పేజీలో కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్ నమోదు చేయాలని తెలిపారు.ఆ తరువాత వచ్చిన ఓ టి పి ఎంటర్ చేసి మళ్ళీ వెరిఫై & ప్రొసీడ్ క్లిక్ 3చేయాలని తెలిపారు. ఆ తరువాత నచ్చిన భాష ను ఎంచుకొని జిల్లా,పట్టణం,పిన్ కోడ్ వివరాలు నమోదు చేయాలని కోరారు.మొబైల్ లో లొకేషన్ ఆన్ చేసి,ఎవరి ఇంటి వద్ద వారు రెడ్ మార్క్ సెట్ చేయాలని తెలిపారు. ఇళ్ల వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, ప్రి వ్యూ ద్వారా చెక్ చేసి సబ్ మిట్ చేసిన తరువాత హెచ్ తో ప్రారంభమయ్యే 11 అంకెల సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐ డి నెంబర్ వస్తుందని తెలిపారు.దాన్ని స్క్రీన్షాట్ తీసుకొని లేదా నమోదు




చేసుకుని భద్రపరిచి గణన అధికారి ఇంటికి వచ్చినప్పుడు చూపిస్తే వారు అప్రూవ్ చేస్తారని అన్నారు. అయితే ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ ఉపయోగించాలని తెలిపారు. దీంతో సమయం ఆదా అవుతుందని తెలిపారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక

ఆదివారం
26 ఏప్రిల్ 2026

# శ్రీమహంకాళి రామ్ మందిర్ దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం

**-హాజరైన మందుముల పరమేశ్వర్ రెడ్డి**



**ఉప్పల్ :**
హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 1 లోని శ్రీ మహంకాళి రామ మందిర్ దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ గా బాబు రావు గారు, సభ్యులుగా విపిన్ అగర్వాల్ ,రఘు సింగమనేని , మల్లాది రమాకాంత్ రెడ్డి ,అమర వాణి మేక , పెద్దోళ్ల విజయలక్ష్మి, రామేశ్వరం ధర్మరాజు,ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ప్రణీత్ గారు ,ఈఓ వెంకన్న ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కంది ఆగి రెడ్డి గారు,బొపన్నపల్లి సుధాకర్ రెడ్డి ,డివిజన్ అధ్యక్షులు విజయ్ ,కంది శ్రవణ్ రెడ్డి , గణేష్ నాయక్, రమేష్ నాయక్, మురళి ముదిరాజ్,విసు , సాగ శ్రీధర్, గంగ, వాసు నాయక్, మరియు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు

# అనారోగ్య బాధితులకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే జారె

**పాముకాటు బాధితునికి 2 లక్షల రూపాయల ఎల్ ఓసి**





**అశ్వరావుపేట :**
ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, అనారోగ్య బాధితులకు అనుక్షణం అండగా నిలుస్తున్నారు. ఈ క్రమం లో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో తన సిఫారసు ద్వారా ట్రీట్మెంట్ పొం దుతున్న వారి నియోజకవర్గంలోని అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామానికి చెందిన బోడా రవి, దమ్మపేట మండలం పెద్దగొల్లగూడెం గ్రామానికి చెందిన రాజిని సూరమ్మ, చంద్రుగొండ మండలం గుర్రంగూడెం గ్రామానికి చెందిన పద్దం సులోచన, ఎల్ఓసి ల ద్వారా ఉచిత ట్రీట్మెంట్ పొందుతుండగా వారిని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరలోనే కోలుకోవాలని ఆకాంక్షిస్తూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదేవిధంగా చంద్రుగొండ మండలం దామరచర్ల గ్రామానికి చెందిన గౌర పెద్దిరాజు, పాముకాటుకు గురై ట్రీట్మెంట్ పొందుతుండగా అవసరమైన రెండు లక్షల రూపాయలను ఎల్ఓసి మంజూరు చేయించి బాధితునికి స్వయంగా అందజేసి మెరుగైన వైద్యం అందిం చాల్సిందిగా సంబంధిత డాక్టర్లకు సూచించారు.

# కాంగ్రెస్ పార్టీ చేసింది వడ్ల గింజంత చెప్పుకునేది వడ్ల కుప్పంత.....

**వడ్లు కొనుగోలు చేయాలని రోడ్డుపై బైఠాయించిన రైతులు.....**

**మాటలకే పరిమితమైన కాంగ్రెస్.....**

**బిఆర్ఎస్ పార్టీ నాయకుడు వేముల హరీష్....**

**అన్నపురెడ్డిపల్లి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్న పురెడ్డిపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఎంతో కష్టపడి పండించిన వడ్లు ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని మండల పరిధిలోని కట్టుగూడెం సీతారామ ప్రాజెక్ట్ బ్రిడ్జి వద్ద విజయవాడ జగ్గల్వార్ జాతీయ రహదారి పై రైతులు వడ్లు కొనుగోలు చేయాలని రోడ్డుపై ధాన్యం పోసి తమ నిరసనను తెలిపారు. తాము కష్టపడి పంటలను పండించి కొనుగోలు కేంద్రానికి వడ్లను తీసుకువచ్చిన సంబంధిత అధికారులు వడ్లు కొనుగోలు చేయక పోవడం వల్ల చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. అశ్వరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, హడావుడితో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని రిప్లేన్ కటింగ్ అది కేవలం రిబ్బన్ కటింగ్ పరిమితమైందని పలువురు పేర్కొన్నారు. అప్పుల్లో కురుకుపోయామని తెలిపారు. ఉన్న కొద్దిపాటి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అధికారులు రోజుల తరబడి నిరీక్షించే విధంగా చేస్తున్నారని తెలిపారు. బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు వేముల హరీష్ మట్లడుతు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి నేటి వరకు రైతులకు ఇచ్చినా రైతు బంధు, సన్న వడ్లకు, బోనస్, రైతు రుణమాఫీ వంటి పథకాలు కొందరికి మాత్రమే పరిమితమయ్యాయని ధ్వజమెత్తారు. త్వరతిగతిన స్పందించి వడ్లు కొనుగోలు చేయకపోతే పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకాలు చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, రైతులు పాల్గొన్నారు. నిరసన స్థలానికి చేరుకున్న తాసిల్దార్ రైతులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం తెలిసిన అన్నపురెడ్డిపల్లి మండల తాసిల్దార్ స్వర్ణ తరలి వెళ్లి రైతుల తో మాట్లాడి సమస్యను పునరావృతం కాకుండా ధాన్యాలను సంబంధిత మిల్లులకు చేర వేస్తామని

# ఓటర్ల జాబితాలను పరిశీలించిన తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్





**ఉప్పల్ :**
ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్ శనివారం పోలింగ్ స్టేషన్ 396లోని ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలను సమగ్రంగా పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాలో ఉన్న ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ఓటర్ లిస్టోని 40 సంవత్సరాల పైబడిన ఓటర్లందరి వద్దకు ఇంటింటికి వెళ్లి వారి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఎం, అలివేలు, స్వాతి,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు,

# రైతుపై రెట్టింపు భారం ఒకవైపు మిల్లర్ల కోతలు మరోవైపు లారీ డ్రైవర్ల వసూళ్లు!



**మాడుగులపల్లి:**
మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి వచ్చిన రైతును అటు మిల్లర్లు, ఇటు రవాణాదారులు కలిసి నిలువునా దోచుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలు కాగితాలకే పరిమితం కావడంతో, క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**బస్తాకు రెండు రూపాయలు ఇస్తేనే వస్తాం..**

కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సిన లారీ యజమానులు, డ్రైవర్లు కొత్త దందాకు తెరలేపారు. బస్తాకు రెండు రూపాయలు అదనంగా ఇస్తేనే లారీలను లోడింగ్ పాయింట్ వద్దకు తీసుకొస్తామని బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే రవాణా ఛార్జీలు ప్రభుత్వం భరిస్తున్నప్పటికీ, రైతుల నుండి ఈ అదనపు వసూళ్లు చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. డబ్బులు ఇవ్వని పక్షంలో లారీలను నిలిపివేస్తూ రవాణాను ఆలస్యం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మిల్లర్ల 'కట్టింగ్' కష్టాలు..**

మరోవైపు, కేంద్రాల నుంచి మిల్లులకు వెళ్లిన ధాన్యానికి మిల్లర్లు భారీగా కట్టింగులు విధిస్తున్నారు. తరుగు పేరుతో క్వింటాకు నిర్ణీత పరిమాణం కంటే ఎక్కువ కోత విధిస్తుండటంతో రైతులకు అపార నష్టం వాటిల్లుతోంది. ఒకవైపు అదనపు రవాణా ఖర్చులు, మరోవైపు మిల్లర్ల కోతలతో పెట్టుబడి కూడా రావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

**అధికారుల మౌనంపై విమర్శలు..**

మండలంలో ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వర్ష సూచనలు ఉన్న తరుణంలో ధాన్యం తడిసిపోతుందనే భయంతో రైతులు వారు అడిగినంత ఇచ్చుకోక తప్పడం లేదు. జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి, మాడుగులపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి, ఈ అక్రమ వసూళ్లను అరికట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ఇందుగుల రోడ్డు నిర్మాణంలో డస్ట్ రాజకీయం వనపర్తి జిల్లా చిన్నారుల శ్రమ దోపిడీ

- **అధికారుల మామూళ్ల మత్తు!**
- **నిబంధనలకు పాతర వేస్తూ ఇసుక బదులు కంకర పొడి (డస్ట్) వినియోగం**
- **వనపర్తి జిల్లా నుంచి వచ్చిన బాల కార్మికులతో పనులు - నిమ్మకు నీరెత్తిన అధికారులు**
- **తక్షణమే తనిఖీలు చేసి కాంట్రాక్టర్పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్**

**మాడుగులపల్లి:**
ప్రజాధనం తోవ తప్పుతోంది నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు అధికారుల పర్యవేక్షణ అటకెక్కింది మాడుగులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణం ఇప్పుడు అవినీతికి నిలువుటద్దంగా మారింది మాడుగులపల్లి నుంచి ఇందుగులకు వెళ్లే ప్రధాన రహదారి పనుల్లో సాగుతున్న అక్రమాలు ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారాయి

**వనపర్తి జిల్లా చిన్నారుల శ్రమ దోపిడీ చట్టం చుట్టమైందా?**

ఈ అక్రమాల్లో అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే, రోడ్డు పనుల్లో బాల కార్మికులను వినియోగించడం ముఖ్యంగా వనపర్తి జిల్లా నుంచి వచ్చిన చిన్నారులను ఇక్కడ వెట్టిచాకిరీకి గురిచేస్తున్నారు బడికి వెళ్లి విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన వయసులో, తక్కువ కూలీకి వస్తారన్న కక్కుర్తితో కాంట్రాక్టర్లు ఈ కఠినమైన పనుల్లో వారిని పెడుతున్నారు ఎండలో, భారీ యంత్రాల మధ్య వనపర్తి జిల్లాకు చెందిన చిన్నారులు ప్రాణాలకు తెగించి పనులు చేస్తున్నా, స్థానిక అధికారులకు కనబడకపోవడం శోచనీయం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 24 బాల కార్మిక నిషేధ చట్టం-2016 ప్రకారం ఇది అత్యంత తీవ్రమైన నేరం.





**ఇసుక మాయం డస్టో మాయాజాలం!**

ఏదైనా రోడ్డు పటిష్టంగా ఉండాలంటే దాని పునాది బలంగా ఉండాలి నిబంధనల ప్రకారం రోడ్డు నిర్మాణంలో నిర్ణీత మోతాదులో ఇసుకను వినియోగించి పనులు చేయాలి కానీ, ఇక్కడ కాంట్రాక్టర్లకు ఆ నిబంధనలు వర్తించవు కాబోలు ఇసుక వాడితే ఖర్చు పెరుగుతుందన్న ఉద్దేశంతో, దాని స్థానంలో నాణ్యత లేని కంకర పొడి (డస్ట్) ను విచ్చలవిడిగా వాడుతున్నారు ఈ డస్టో రోడ్డు నిర్మిస్తే అది లోపల గట్టిదనాన్ని కోల్పోయి, వాహనాల రాకపోకలు మొదలైన కొద్దిరోజులకే కుంగిపోతుంది కేవలం పైపైన రంగు పూసి లోపల డస్టో నింపేస్తున్న ఈ నాణ్యత లేని రోడ్డు, మొదటి వర్షానికే కొట్టుకుపోవడం ఖాయమని స్థానికులు మండిపడుతున్నారు

**అధికారుల నిర్లక్ష్యం అంతా అడ్జస్ట్ మెంట్ మాయేనా?**

క్షేత్రస్థాయిలో పనులు జరుగుతుంటే ఇంజనీరింగ్ అధికారులు, పర్యవేక్షక సిబ్బంది ఏం చేస్తున్నట్లు? వనపర్తి నుంచి వచ్చిన పిల్లల చేత పనులు చేయిస్తున్నా, నాణ్యత లేని మెటీరియల్ వాడుతున్నా ఏ ఒక్కరూ తనిఖీ చేసిన దాఖలాలు లేవు అధికారులు కాంట్రాక్టర్లతో చేతులు కలిపి కమిషన్ల మత్తులో జోగుతున్నారని, అందుకే ఈ అక్రమాలు బాహాటంగా జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు

**ప్రజల డిమాండ్**

వెంటనే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇందు గుల రోడ్డు పనులను తనిఖీ చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్పై చర్యలు తీసుకో వాలని స్థానికులు కోరుతున్నారు వనపర్తి జిల్లా బాల కార్మికులను వెట్టిచాకిరీ నుంచి విముక్తి కలిగించి, బాధ్యులపై సెక్షన్ 14 కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co